Sri Anjaneya
SECURITY & HOUSEKEEPING SERVICES

ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ,యువకులు కావలెను.

మార్కెటింగ్ మేనేజర్ (M/F),సెక్యూరిటీ గార్డ్స్ (M/F), కారు డ్రైవర్లు, అకౌంటెంట్,ఆఫీస్ ఇన్ చార్జ్(F), అర్జంట్ గా కావలెను.

contact: 9392480345,9100397039

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక



సంపుటి : 01 సంచిక : 62 23 - 10 - 2026 శుక్రవారం ఎడిటర్ : దొండ్లవాగు భవ్య పేజీలు : 8 వెల : 10/-

ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు

నవంబరు 1న ఎన్నికలు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈసీ నిర్ణయం
- నవంబర్ 1న పోలింగ్, 3వ తేదీన ఓట్ల లెక్కింపు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నిర్ణయం
- కడప, తిరుపతి సహా నాలుగు చోట్ల తిరిగి నామినేషన్లకు అవకాశం



అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సవరించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీన జరగాల్సిన పోలింగ్‌ను నవంబరు ఒకటో తేదీకి వాయిదా వేసింది. మూడో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు ప్రకటించనుంది. అలాగే మైదుకూరు మున్సిపాలిటీలో తాజాగా మొత్తం వార్డులకు నామినేషన్లు స్వీకరించాలని నిర్ణయించింది. కడప కార్పొరేషన్‌లో 11 వార్డులు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులు, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులకు మాత్రం నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించింది. ఈ నాలుగు చోట్లా శుక్ర, శనివారాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటారు. 25న ఉదయం వాటిని పరిశీలిస్తారు. వాటిని ఉపసంహరించుకునేందుకు ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు గడువిచ్చారు. 3 గంటల తర్వాత మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల బరిలో నిలిచిన

8లో



విదేశాల్లో ఉంటూ విమర్శలా? : అమిత్ షా

మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు..రాహుల్‌పై అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941

8లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవాలి : మోదీ




న్యూఢిల్లీ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కూడా త్వరగా ముగిసిపోవాలని కోరుకుంటున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శాంతిస్థాపనకే భారత్ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. పోలండ్ ప్రధాని డొనాల్డ్ ?టస్క్?తో కలిసి గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువల పై భారత్, పోలండ్ దేశాలకు నమ్మకం ఉందన్నారు. ఆ ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయడానికి అంతర్జాతీయ వ్యవస్థల్లో సంస్కరణలు అవసరమన్నారు.

8లో

ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు



అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి. వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వంకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలి కమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచిం చారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు నన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.



వాట్సాప్, టెలిగ్రామ్ యూజర్లకు అలర్ట్

ఇకపై మీ ఫోన్‌లో సిమ్ తప్పనిసరి!

న్యూఢిల్లీ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్రముఖ మెసేజింగ్ యాప్‌ల వినియోగదారులకు ఇది అత్యంత కీలకమైన సమాచారం. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'సిమ్ బైండింగ్' పేరుతో నూతన నిబంధనలను తీసుకువస్తోంది. ఈ నిబంధనలు అమలులోకి వస్తే, ఆయా యాప్‌లను వినియోగించాలంటే సదరు మొబైల్ నెంబర్‌కు సంబంధించిన సిమ్ కార్డు తప్పనిసరిగా ఫోన్‌లో ఉండాల్సిందే. ఈ మేరకు టెలికమ్యూనికేషన్స్ విభాగం (డాట్) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నూతన నిబంధనల ప్రకారం, యాప్ ఖాతాతో

ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం : వెంకయ్యనాయుడు

హైదరాబాద్ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శు



క్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ

2వ పేజీలో



8లో

తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై

వైసీపీ దాడి అత్యంత హేయం : నాదెండ్ల

అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో జనసేన పార్టీ కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఈ దాడి జరగడం అత్యంత హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ఓటమి భయంతోనే వైసీపీ హింసకు పాల్పడుతోందని, రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని



8లో

ఎంత వరకైనా

పోరాడదాం : జగన్

అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు

పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి: సీఎం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22 e SIPB సమావేశం
- గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
- 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం



8వ పేజీలో

అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు.

సీఎంతో పవన్ భేటీ..వైసీపీ 'స్థానిక' అరాచకాలు, కోర్టు వివాదాలపై చర్చ

ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల అరాచకాలు, సుప్రీంకోర్టు తీర్పు, మున్సిపల్ అభ్యర్థుల తుది జాబితా తాత్కాలిక నిలుపుదల తదితర అంశాలపై చర్చించారు. గురువారం ఉదయం ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చిన పవన్ అరగంట ఆయనతో భేటీ అయ్యారు.

కొస్తా ఆంధ్ర ఎడిషన్
ఒంగోలు | బాపట్ల | నరసరావు పేట | గుంటూరు | విజయవాడ | రాజమండ్రి | నర్సాపురం | ఏలూరు
23 - 10 - 2026 అక్టోబర్ శుక్రవారం
గ్లోబల్ వార్త తెలుగు దినపత్రిక
2

విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం : ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): (రామవరపాడు ఎం కన్వెన్షన్) సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో, కేశినేని ఫౌండేషన్ మరియు జిజ్ఞాస ఆర్ట్స్ వర్క్స్ సంయుక్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం రామవరప్పాడు రింగ్ వద్ద సర్వీసు రోడ్ లో ఉన్న ఎం కన్వెన్షన్ నందు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని, వివిధ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా మొత్తం ఏడు విభాగాల్లో వందకు పైగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రతిభావంతులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా



నిలిచిన వారిని ఎంపీ కేశినేని చిన్ని అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, విద్యార్థులు, యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా వివిధ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. విజయవాడ నగరాన్ని సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, కేశినేని ఫౌండేషన్, జిజ్ఞాస ఆర్ట్స్ వర్క్స్ సంయుక్తంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పోటీల్లో విజయం సాధించిన వారితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరూ అభినందనీయులేనని తెలిపారు .గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ, తమ ప్రతిభకు మరింత పదును పెట్టుకోవాలని విజేతలకు సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, విజయవాడ నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విజయవాడ ఉత్సవ్ ద్వారా నగర ప్రజలకు వినోదంతో పాటు కళలు, సంస్కృతి, సృజనాత్మకతకు సంబంధించిన అనేక కార్యక్రమాలను అందించగలిగామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని సతీమణి జానకి లక్ష్మి, సొసైటీ ఫర్ వైబ్రేశీట్ విజయవాడ సభ్యులు విజయవాడ ఉత్సవ్ సభ్యులు జిజ్ఞాస ఆర్ట్ వర్స్ సభ్యులు పాల్గొన్నారు

నిరాడంబరతకు, నిజాయితీకి ప్రతిరూపం ఎస్.ఆర్.శంకరన్

నెల్లూరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అక్టోబర్ 22 ఆయన జయంతి సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ.. జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరాడంబరత, నిజాయితీ, నిబద్ధతలకు ప్రతిరూపంగా నిలిచిన శంకరన్ అధికారమంటే హోదా, ఆర్భాటం కాదని, ప్రజలకు సేవ చేయడమే నిజమైన బాధ్యత అని నిరూపించారన్నారు.

సామాన్య కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన శంకరన్

ఎస్.ఆర్. శంకరన్ 1934 అక్టోబర్ 22న తమిళనాడులోని తంజావూరు జిల్లాలో జన్మించారు. ఆయన తండ్రి రైల్వే గార్డుగా పనిచేశారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీకాం పూర్తి చేసిన శంకరన్, మదురైలో మూడేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచేశారు. 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. 1992 వరకు వివిధ హోదాల్లో ఐఏఎస్ అధికారిగా సేవలందించారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ, వివిధ శాఖల కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు పలు బాధ్యతలు నిర్వహించారు. అవివాహితుడిగా జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు.

నిరాడంబర జీవనశైలి.. మానవత్వానికి నిదర్శనం:

ఉన్నత పదవుల్లో పనిచేసినప్పటికీ శంకరన్ సాధారణ జీవనశైలిని అనుసరించేవారని, సామాన్యుల పట్ల ఎంతో గౌరవంతో వ్యవహరించేవారని కలెక్టర్ తెలిపారు. ఒకసారి అగర్తలా విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అధికారిక వాహనం కోసం ఎదురుచూడకుండా సర్క్యూట్ హౌస్‌కు వెళ్లేందుకు సాధారణ రిక్షాను ఆశ్రయించారు. తన కోసం రిక్షా నడిపేందుకు అంగీకరించిన వ్యక్తి ఇతర ప్రయాణికులను కోల్పోయినందున, తాను ప్రయాణించకపోయినా ముందుగా ఒప్పుకున్న చార్జీని చెల్లించేందుకు సిద్ధపడటం ఆయన మానవత్వానికి, ఇతరుల శ్రమ పట్ల గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనిరాధారణమైన కార్యదక్షత, నమ్మశక్యం కానంత నిరాడంబర జీవనశైలి. అణగారిన వర్గాల అభ్యు న్నతి పట్ల అపారమైన అంకితభావం శంకరన్ ప్రత్యేకతలు. ఈ లక్షణాల ద్వారా ఆయన తన కంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారన్నారు. తెలుగునాట పేదల దృష్టిలో, వారి హృదయాల్లో ఆయన చిరస్మరణీయమైన స్థానాన్ని పొందారన్నారు. 1992లో పదవీ విరమణ చేసిన అనంతరం కూడా ఆయన ప్రజాసేవను కొనసాగించారు. తన పెన్షన్‌లో కొంత భాగాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి అందిస్తూ, పేదల హక్కుల పరిరక్షణకు కృషి



చేశారు. సామాజిక సమస్యలకు శాంతియుత పరిష్కారాలను కనుగొనేందుకు పౌరుల భాగస్వామ్యంతో మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేపట్టారు.

నెల్లూరు కలెక్టరేట్‌లో శంకరన్ హాల్:

ఎస్.ఆర్. శంకరన్ ప్రజాసేవలను స్మరించుకుంటూ నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఒక హాల్‌కు 'శంకరన్ హాల్'గా నామకరణం చేశారు. వివిధ అధికారిక సమావేశాలు జరిగే ఈ హాల్ ద్వారా ఆయన సేవలను ప్రతిరోజూ స్మరించుకునే అవకాశం కలుగుతోంది. నిరాడంబరత, నిజాయితీ, పేదల పట్ల అంకితభావం వంటి ఆయన ఆదర్శాలు ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధారణ కార్యదక్షత, నమ్మశక్యం కాని నిరాడంబర జీవనశైలి, అణగారిన వర్గాల అభ్యున్నతి పట్ల అపారమైన అంకితభావం శంకరన్ ప్రత్యేకతలని తెలిపారు. తన సేవలతో ఆయన ప్రజల హృదయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. 2010 అక్టోబర్ 7న ఆయన కన్నుమూసినప్పటికీ, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు, ఆదర్శప్రాయమైన జీవనశైలి నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలనే సందేశాన్ని శంకరన్ జీవితం అందిస్తోందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

బిజెపికి రాజీనామా చేసిన ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు విజయ్ కుమార్ చారి



కనిగిరి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): మార్కాపురం జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు, పెరమన విజయ్ కుమార్ చారి బిజెపికి మరియు పార్టీలో ఉన్న క్రియాశీల సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్‌కి మరియు జిల్లా అధ్యక్షులు పి వి కృష్ణారావుకి తన రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా, కనిగిరి నియోజకవర్గం, పామూరు గ్రామానికి చెందిన విజయ్ కుమార్ చారి మాట్లాడుతూ దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, నాకు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి దేశం, ధర్మం, జాతీయ భావజాలం పట్ల నిబద్ధతతో పనిచేసే పార్టీగా భారతీయ జనతా పార్టీని విశ్వసించాను. గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి పట్ల వారి అంకితభావం, స్ఫూర్తితో 2013వ సంవత్సరం నుంచి భారతీయ జనతా పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో కొనసాగుతున్నాను. ఈ రాజకీయ ప్రస్థానంలో పామూరు టౌన్ బిజెపి యువమోర్చా అధ్యక్షుడిగా, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, కనిగిరి నియోజకవర్గ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా, ఎలక్షన్ మేనేజ్మెంట్ కన్వినర్ గా,జిల్లా యువమోర్చా కార్యదర్శిగా, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వహించాను.పార్టీ నాకు అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేశాను. ముఖ్యంగా పామూరు మండలం, కనిగిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేశాను. అయితే, గత 13 సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తూ, ఎన్నో రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, పార్టీ పట్ల నా నిబద్ధతను ఎప్పుడూ తగ్గించుకోలేదు. పార్టీ అభివృద్ధి కోసం నా శక్తి మేరకు కృషి చేస్తూ వచ్చాను.ప్రస్తుతం కొన్ని అనివార్య కారణాల వల్ల, భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మరియు క్రియాశీలక రాజకీయ బాధ్యతలకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నా ను. ఈ నిర్ణయం తీసుకోవడం నాకు వ్యక్తిగతంగా బాధాకరమైనప్పటికీ, నా రాజకీయ భవిష్యత్తు మరియు ప్రజాసేవకు సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాను.బీజేపీలో పనిచేసిన సమయంలో నాకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులకు, పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రాజకీయాల కంటే ప్రజాసేవే నాకు ముఖ్యం. భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నా వంతు కృషి చేస్తాను. నా రాజకీయ ప్రస్థానంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తూ భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మరియు క్రియాశీల సభ్యత్వానికి నేను సమర్పిస్తున్న రాజీనామాను దయచేసి ఆమోదించవలసిందిగా వినమ్రంగా కోరుతున్నాను.

పూడి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ నామినేషన్



తొట్టంబేడు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): తొట్టంబేడు మండలంలోని పూడి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అద్దూరు అంకమ్మ గారు ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు.పూడి సెగ్మెంట్ మహిళా రిజర్వ్ స్థానానికి టీడీపీ తరపున అద్దూరు అంకమ్మ గురువారం మండల కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు అద్దూరు సురేష్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ, కట్టుబాటు, విధేయతలకు నిదర్శనమని, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఇచ్చే పార్టీ టీడీపీ మాత్రమే అని అన్నారు.గత ఎన్నికలలో కూడా బూత్ స్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశారని, ఆ నిబద్ధతకు ప్రతిఫలంగానే నేడు టీడీపీ తరపున నామినేషన్ వేసే అవకాశం దక్కిందని తెలిపారు.మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, సామాన్య కార్యకర్త కుటుంబాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని,చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అద్దూరు అంకమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

36 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ దాఖలు

గుడిబండ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు 36 ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయ కుమార్ బాబు, సహాయ అధికారి ఎంపీడీవో కేశవరెడ్డి తెలిపారు గుడిబండ మండల వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీకి చెందిన 14 మంది ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయగా వైఎస్ఆర్సిపి పార్టీ



తరపున 14 మంది జనసేన పార్టీ తరపున ఒకరు కాంగ్రెస్ పార్టీ తరపున 7 మంది మొత్తం 36 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు వారు తెలిపారు. ఈ నామినేషన్ల సందర్భంగా గుడిబండ ఎస్సై రమేష్ బాబు తన సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

వైకాపా నాయకుల అరాచకం తగదు : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వైకాపా, టీడీపీ శ్రేణుల మధ్య చోటుచేసుకున్న తోపులాటపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో అలజడులు సృష్టించడం తగదన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే అనుమతించే నిబంధనలు ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పెద్ద సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలతో రావడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం, టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. మధుసూదన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం,ఎంపీ గురుమూర్తి, పవిత్రారెడ్డి, ఆకర్ష్‌రెడ్డిలు కలిసి నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. తిరుపతి నుంచి కొంతమందిని తీసుకొచ్చి స్థానికంగా వాతావరణాన్ని కలుషితం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు.నాయకుల మాటలు నమ్మి వైకాపా కార్యకర్తలు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమపై, పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించిన విషయాన్ని మరచిపోలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నరేళ్లుగా వైకాపా నాయకులు, కార్యకర్తలను తాము లక్ష్యంగా చేసుకోలేదన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారని, అందుకే క్రమశిక్షణతో నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తమ సంయమనాన్ని అలుసుగా తీసుకుని అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించే నాయకులను ఆదరించవద్దని ఆయన కోరారు.


లవ్ జిహాద్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలి

కనిగిరి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): రాష్ట్ర పార్టీ సూచన మేరకు లవ్ జిహాదీ పై కఠిన చర్యలు తీసుకోవాలి అని సి ఎస్ పురం సబ్ ఇన్స్పెక్టర్ గారికి సి ఎస్ పురం మండల అధ్యక్షులు పాశం రామకృష్ణ గారి అధ్యక్షతన మండల బిజెపి ఇన్చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, మండల బిజెపి నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది విషయం : సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబం కు న్యాయం చేయాలి. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నది. షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ణ-ష్ట్ర, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలి.ొ-ఱ్ట్ర కాకినాడ నాయకుని సిఫార్సుతో ఇంటర్నేషనల్ స్కూల్ లో రైఫిల్ షూటింగ్ శిక్షకునిగా పని చేస్తూ పరిచయమైన సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబం కు న్యాయం చేయాలి. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నది. షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి, ఇతనికి సహకరించినవారిపై చర్యలు తీసుకోవాలి..హిందూ మహిళలకు బాలికలకు రక్షణ లేకుండాపోయింది. జిమ్ములు, జుంబా డాన్సులు, సెలూన్ / బ్యూటీ పార్లర్ సెంటర్లు, కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ప్రధాన కేంద్రాలుగా లవ్ జహాజీ లు పనిచేస్తున్నారు. ఆల్ ఉమా ఉగ్రవాదుల కార్యకర్తలు కాకినాడలో దొరికారు, జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందినవారు పెద్దాపురంలో దొరికారు, కానీ



అప్రమత్తంగా ఉండాల్సినటువంటి పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇటువంటి ప్రాంతాల్లో లవ్ జిహాది బయటకు వచ్చింది. ఏఈ నూకరాజు గారి కుటుంబం యొక్క సంఘటన చాలా తీవ్రమైనది, విచారకరమైనది. ఈ సంఘటన వివరాలు తెలుసుకుంటే ఆందోళన కలుగుతున్నది. ప్రారంభించిన సాదిక్ ఖాన్. కొన్ని కోట్ల రూపాయల నగదు,బంగారం తీసుకొని మళ్ళీమళ్ళీ బ్లాక్మెయిల్ చేయడం ప్రారంభించిన సాదిక్ ఖాన్, ఇంటి మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని భర్త అనారోగ్యాన్ని గమనించి అతనికి విషం ఇచ్చి చంపేసిన సాదిక్ ఖాన్. చివరి అంశంగా ఆమె పేరు మీద ఉన్న మొత్తం యావదఆస్తిని తన పేరు రాసి ఏఈ నూకరాజు, తను భార్య మనవడు కార్తికేయ ,సౌజన్య కుటుంబం మొత్తం ఇస్లాం మతం స్వీకరించాలని కండిషన్ పెట్టిన సాదిక్ ఖాన్, లేనిపక్షంలో ఈ ప్రైవేట్ ఫోటోలు వీడియోలు బయటికి ప్రపంచానికి చెప్పడమే కాకుండా, తన భర్తను హతంచేసినట్టు కుమారుణ్ణి కూడా హతమారుస్తానని బెదిరింపులు. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది భారతీయ జనతా పార్టీ. లవ్ జిహాదీ సాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి అని కోరుచున్నది. అంతేకాకుండా, పోలీస్ లు లవ్ జిహాదీపై రాష్ట్రవ్యాప్తంగా పెడుతున్నటువంటి కేసులు ఏమిటి? చేస్తున్న సమీక్ష ఏమిటి? ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు ఏమిటి? దీనిపై తీసుకున్నటువంటి చర్యలు ఏమిటి? ఖీ×= అయిన కేసులపై రిఫర్ చేసిన సంఘటనలు ఎన్ని? పూర్తి వివరాలతో రాష్ట్ర డిజిపి మరియు హోం శాఖ మంత్రి మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జాజం చిన్న సుబ్బయ్య, పెద్దిరెడ్డి రమణారెడ్డి, సాదు వెంకటేశ్వర్లు, గుర్రం నారాయణ,టీ లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శి ఇండ్ల దుర్గాప్రసాద్ మన్నేపల్లి మాల్యాద్రి, , బత్తుల రమేష్,తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ పరిధిలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు : మయూర్ అశోక్



గుంటూరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు ఆప్కాస్ ఉద్యోగులను తొలగిస్తూ, ఆప్కాస్ ఎండి, జిల్లా కలెక్టర్ లకు లేఖలు పంపినట్లు నగర కమిషనర్ మరియు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఆప్కాస్ విధానంలో అన్ స్కిల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్న ఈదులమూడి సరోజినిదేవి తన ఉద్యోగానికి రాజీనామా చేయకుండానే, స్థానిక సంస్థల ఎన్నికల్లో 67వ వార్డు (శారద కాలనీ) నుండి కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారన్నారు. ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగంలో కొనసాగుతూ నామినేషన్ వేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధం కావడంతో, ఆమెను గుంటూరు నగరపాలక సంస్థ ఆప్కాస్ ఉద్యోగుల జాబితా నుండి తొలగించేందుకు ఆప్కాస్ మేనేజింగ్ డైరెక్టర్ కు లేఖ పంపామన్నారు. అలాగే, తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్స్ లో ఆప్కాస్ విధానంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అంజాతుల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీ ఆభ్యర్థిని కలసి సంఘీభావం తెలిపడం, వారి వెంట బహిరంగ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి రాజకీయ ప్రచారాల్లో పాల్గొనడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే కాబట్టి, సదరు ఉద్యోగిని కూడా ఆప్కాస్ జాబితా నుండి తొలగించి, ఆప్కాస్ ఎండీకి లేఖ పంపామని తెలిపారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వ లేదా కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రచారాల్లో కానీ, రాజకీయ కార్యక్రమాల్లో కానీ పాల్గొనకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారంలో పాల్గొన్నా లేదా ఎన్నికల్లో పోటీ చేసినా ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శాఖాపరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రుల ఉత్సవాలు

వినుకొండ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): :వినుకొండ పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డు రైలుపేట నాలుగో లైన్‌లో శ్రీ విజ్ఞ హరిత సంకల్ప సమితి ఆధ్వర్యంలో గత పది రోజులుగా శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా విశేషంగా అలంకరించి, ఎద్దుల బండిపై కొలువుదీర్చి, శాస్త్రీయ మంగళ వాయిద్యాల నడుమ పట్టణంలోని పురవీధుల గుండా వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గులకమ్మ వద్ద అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత పది రోజులుగా నిర్వహించిన శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు జరిగిన ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమంతో ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చీమకుర్తి బ్రహ్మం (న్యాయవాది), మద్దిరాల పూర్ణచంద్రరావు, ఎస్.కె. అనీఫ్, కుందుర్తి అశోక్ కుమార్, చీమకుర్తి అశోక్ (న్యాయవాది), వి. అజయ్ బాబు, సి.హెచ్. ఆదిత్య, మద్దిరాల మారుతి, కారుమంచి హనుమంతరావు, గరిమిడి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు ఎంపీటీసీకి టీడీపీ అభ్యర్థిగా చిల్లకూరు ఆనందమ్మ నామినేషన్



తొట్టంబేడు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఉత్సాహంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా తొట్టంబేడు ఎంపీటీసీ స్థానానికి (బీసీ మహిళ రిజర్వ్ సెగ్మెంట్) తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చిల్లకూరు ఆనందమ్మ గురువారం తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు.బీసీ సామాజిక వర్గానికి చెందిన చిల్లకూరు ఆనందమ్మ ను పార్టీ అధిష్టానం తొట్టంబేడు స్థానానికి అభ్యర్థిగా ప్రకటించింది. నామినేషన్ సందర్భంగా ఆమె వెంట పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అభ్యర్థి చిల్లకూరు ఆనందమ్మ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన తెలుగుదేశం పార్టీ అధినేతకు, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తొట్టంబేడు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తొట్టంబేడు గ్రామానికి చెందిన తంగేళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంకు చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, తొట్టంబేడు మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి అండదండలు, ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేసినట్లు ఆమె తెలిపారు. వారి సహకారంతోనే ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చేతుల మీదుగా శ్రీ వెంకటేశ్వర మోటార్స్ ప్రారంభం



పలమనేరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): పలమనేరు పట్టణ సమీపంలోని ఆటోనగర్--ఎంఎస్ఎంఈ పారిశ్రామిక ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మోటార్స్ యూనిట్‌ను పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. పలమనేరు పట్టణానికి చెందిన లోకనాథ రెడ్డి ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి యూనిట్‌ను ప్రారంభించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి, నూతన వ్యాపారాల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. స్థానికంగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. నూతనంగా యూనిట్‌ను ఏర్పాటు చేసిన లోకనాథ రెడ్డిని అభినందిస్తూ శ్రీ వెంకటేశ్వర మోటార్స్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

పలమనేరు ఆటోనగర్ ప్రాంతంలో నూతన యూనిట్ల ఏర్పాటు స్థానిక పారిశ్రామిక రంగానికి మరింత ఊతమిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం పారిశ్రామికవేత్తలు, వ్యాపార వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా విద్యాసంస్థల చైర్మన్ రవీంద్ర బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆటోనగర్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్. అమరనాథ రెడ్డి, అధ్యక్షులు జగదీష్, శ్రీనివాసులు, సుబ్బు, ఎస్ఎంఎల్ మహీంద్రా లిమిటెడ్ సౌత్ హెడ్ నీలకంఠన్, జెడ్ఎస్ఎం ప్రసాద్ బాబు, ఎస్బిహెచ్ నారాయణ్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా వారి పుణ్య తిథి మహోత్సవం



నరసరావుపేట , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): శ్రీ షిరిడి సాయిబాబా వారి పుణ్య తిథి మహోత్సవం ది.21-10-2026. బుధవారం ఉదయం 6 గంటలకు కాకడ హారతి తో పూజా కార్యక్రమాలు విశేషంగా బాబా వారికి పంచామృత అభిషేకం భస్మాభిషేకం పుష్పాభిషేకం వివిధరిగా నిర్వహించడం జరిగినది అనంతరం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు రిచే ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం 108 మంది భక్తులచే బాబా వారికి మధ్యాహ్న హారతి నిర్వహించడం జరిగినది. పుణ్యతిథి సందర్భంగా బాబా వారికి వడమాల సమర్పించడం అనంతరం సుమారుగా 1000 మందికి బాబా వారి అన్న ప్రసాదం అందించడం జరిగింది. ఈ కార్యక్రమాలన్నీ కూడా శ్రీ షిరిడి సాయిబాబా సత్సంగ్ కమిటీ వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీలు



విజయవాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి ఉన్న అన్ని దారులూ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం తరలివస్తున్న భవానీ భక్తులు, సాధారణ భక్తుల రద్దీతో విజయవాడ నగరం భక్తి సాగరమైంది. ఇటు వన్ టౌన్ వినాయక గుడి నుండి, అటు కుమ్మరిపాలెం సెంటర్ మీదుగా భక్తుల ప్రవాహం పోటెత్తడంతో ఆలయ పరిసరాలు ఎరుపు వర్ణ శోభతో పులకించాయి. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 1,39,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఘాట్ రోడ్డులోని వివిధ హోల్డింగ్ ఏరియాలు, స్నానాల రేవుల్లో వేలాది మంది భక్తులు అమ్మ దర్శనార్థం వేచి ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి భవానీ భక్తులు ఇప్పటికే ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ బస్సులు మరియు ప్రైవేటు వాహనాలలో భారీ ఎత్తున విజయవాడకు తరలివస్తున్నారు. దసరా ముగిసినప్పటికీ భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తుల రద్దీ దృష్ట్యా లడ్డూ ప్రసాదం కౌంటర్ల వద్ద ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టారు. ?ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ నిరంతరం క్యూలైన్లు, ఘాట్ రోడ్డు ప్రాంగణాల్లో పర్యటించి భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేశారు. ?ఆలయ ఈఈ రమాదేవి, సహాయ కార్యనిర్వహణాధికారులు చంద్రశేఖర్, రమేష్‌బాబు, డాక్టర్ కె.గంగాధర్, సుధారాణి, లక్ష్మి ప్రసన్న క్షేత్రస్థాయిలో ఉంటూ అటు పోలీసు విభాగంతో, ఇటు దేవస్థాన సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అద్భుతమైన టీమ్ వర్క్‌తో దర్శనాలు సాఫీగా సాగేలా పర్యవేక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవానీ ఘాట్‌లో దేవస్థానం షవర్లతో జల్లు స్నానాల ఏర్పాట్లు చేసింది. ?దేవస్థాన నిధులతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో గత 10 రోజుల్లో రికార్డు స్థాయిలో 31 లక్షల మంచినీటి బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు దుర్గగుడి అధికారులు ప్రకటించారు. కొండదిగువన ఉన్న అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ కొనసాగుతోంది. రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ భక్తులకు సేవలందిస్తున్నారు.

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఘనంగా నివాళి



కనిగిరి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): సమాజంలోని చిట్టచివరి వ్యక్తి అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అనే అంత్యోదయ సిద్ధాంతాన్ని దేశానికి అందించిన ఏకాత్మ మానవవాద సిద్ధాంత ప్రవక్త, భరతమాత ముద్దుబిడ్డ, జన్ సంఘ్ వ్యవస్థాపకులు, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతి సందర్భంగా శుక్రవారం పామూరు లోని సిఎస్పురం రోడ్ లో గల మండల బిజెపి కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిజెపి నేతలు పాల్గొని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక ఆలోచనా చరిత్రలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ పేరు ఒక ప్రత్యేకమైన అధ్యాయం. సాధారణ కుటుంబంలో జన్మించి, బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, అనేక కష్టాలను ఎదుర్కొంటూ విద్యలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించి, చివరకు దేశసేవనే తన జీవిత లక్ష్యంగా స్వీకరించిన మహనీయుడు దీన్ దయాళ్ జీ అని అన్నారు.దీన్ దయాళ్ జీ ఆలోచనలో అత్యంత మానవీయమైన అంశం అంత్యోదయం. సమాజంలో ముందున్న వ్యక్తి మరింత ముందుకు వెళ్లడం మాత్రమే అభివృద్ధి కాదు. వెనుకబడిన వ్యక్తి జీవితంలో వెలుగు రావడం కూడా అభివృద్ధికి ప్రమాణం. జీవితం వ్యక్తిగత సుఖాల కంటే సమాజం, దేశం కోసం అంకితం కావచ్చని నిరూపించిన అదర్శ జీవితం అని నమ్మిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల బిజెపి అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను, మార్కాపురం జిల్లా నాయకులు పెరమన విజయ్ కుమార్ చారి, మండల బిజెపి ఉపాధ్యక్షులు చామల శ్రీనివాసరెడ్డి, మండల బిజెపి ప్రధాన కార్యదర్శులు సింగరాజు శివ కృష్ణ,పాడే అరవింద్, మండల బిజెపి కార్యదర్శి దేవిశెట్టి పవన్ కుమార్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ అభ్యర్థులుగా కూటమి నేతల నామినేషన్లు



పుంగనూరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నిక్కుండి ఎంపీటీసీ అభ్యర్థులుగా టి. శ్రీనాథ్, మరియు టి. శ్రీదేవి నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వై. మధుసూదన్ నాయుడు ఆదేశాల మేరకు పుంగనూరు రూరల్ మండలానికి చెందిన నిక్కుండి ఎంపీటీసీ అభ్యర్థులు కూటమి నాయకులతో కలిసి పుంగనూరు పట్టణంలోని గోకుల్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి మదనపల్లి రోడ్డులో ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న కొత్త ఇండ్లలోని మున్సిపల్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రానికి చేరుకుని ఎన్నికల అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో నెక్కుంది పంచాయతీకి చెందిన రమణ,వై. లోకేష్ రెడ్డి,సురేష్ రెడ్డి,పురుషోత్తం, షణ్ముగంరెడ్డి,రెడ్డెప్పరెడ్డి,సుధాకర్ రెడ్డి,నాగభూషణం ప్రశాంత్, సుబ్రమణ్యం,మురళీ, బద్రీనాథ్ ఆచ్చారి,కిషోర్,మునిరామయ్య లతో పాటు మహిళలు మరియు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు..

ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి



గుడిబండ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): గుడిబండ మండలం పరిషత్ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొని అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా ఉన్నాయో లేదో ఆయన తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప సింగిల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప న్యాయవాది శివకుమార్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ క్రమశిక్షణతో సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు సమిష్టిగా కృషి చేసి మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాల్లో ను తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ను గెలిపించు కోవడానికి ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేసే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జనసేన బిజెపి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గుడిబండ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): ప్రస్తుతం జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి సర్పంచులు స్థానాలకు నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నియమాలిని ఉల్లంఘించి ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని గుడిబండ ఎస్సై రమేష్ బాబు హెచ్చరించారు. నామినేషన్ ప్రారంభం నుంచి పోలింగ్ అయ్యేంతవరకు మండల వ్యాప్తంగా 163 బి ఎన్ ఎస్ ఎస్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరైనా సరే ఎక్కడైనా సరే గుంపులు గుంపులుగా ఉండటం కానీ అరవడం ఊరేగింపు చేయడం సభలు సమావేశాలు నిర్వహించడం నిషేధమని అలా కాదని ఎవరైనా ఎన్నికల నియమాలిని ఉల్లంఘించి ప్రవర్తిస్తే అలాంటి వారిపై సిసి కోడ్ ఉల్లంఘన పై కేసు నమోదు చేయడం జరుగుతుందని నామినేషన్ వేసే రోజు ఎవరు కూడా ర్యాలీగా ఊరేగింపుగా రాకూడదని నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి తోడు ఒకరు కానీ ఇద్దరు కానీ నామినేషన్లు వేయడానికి రావచ్చని వేయడానికి 200 మీటర్లు దాటి రావాలన్నారు. నామినేషన్లు వేసే రోజు అనగా 21 22 23 వ తేదీల్లో గుంపులు గుంపులుగా ఎక్కడ కూడా నామినేషన్లు వేసే రోజు సమావేశాలు కానీ ఊరేగింపులు మీటింగులు ఎక్కువ మందితో వస్తే ప్రతిదీ కూడా సీసీ కెమెరాలు నమోదు అవుతుందని ఆయన తెలిపారు.

ఓటమి భయంతోనే తెలుగుదేశం పార్టీ డ్రామాలు

నరసరావుపేట , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేయించడానికి రొంపిచర్ల నామినేషన్ కేంద్రానికి బయలుదేరిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని కిలోమీటర్ దూరంలోనే పోలీసులు అడ్డుకొని పాశవికంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీద లాఠీచార్జి చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై దాడులు చేయడానికి తెలుగుదేశం పార్టీ వారు ముందస్తుగానే నామినేషన్ కేంద్రాల వద్ద రాళ్లు ,కర్రలు ,బీరు బాటిల్స్ సిద్ధం చేసుకున్నారని, గ్రానైట్ ఫ్యాక్టరీలలో పనిచేసే బిహారి గ్యాంగుల్ని సుమారు 300 మందిని పిలిపించి మా మీద దాడులు చేయడానికి ,మమ్మల్ని నామినేషన్ వేయకుండా అడ్డుకోవడానికి తెలుగుదేశం పార్టీ ఒక దుర్మార్గపు ఆలోచన చేసిందని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని పోలీసులు ఎత్తుకెళ్లారని, మేము ఇక్కడికి రావడానికి దాదాపు 15 గ్రామాలు తిరిగి రావాల్సి వచ్చిందని, నామినేషన్ కేంద్రానికి కిలోమీటర్ ముందే పోలీసులు మమ్మల్ని



అడ్డుకున్నారని ,మాపై లాఠీ జార్జి చేశారని ,మేము గంటన్నర పాటు ధర్నా చేసిన అనంతరం డిఎస్పి వచ్చి మాచేత నామినేషన్ వేయిస్తామని హామీ ఇచ్చారని, అయినప్పటికీ డీఎస్పీ ని కూడా తెలుగుదేశం పార్టీ వాళ్ళు లెక్కచేయకుండా నామినేషన్ హాల్లో రాళ్లు పెట్టుకొని మాపై దాడి చేయాలని చూశారని, డీఎస్పీ ఎస్పీ ని సంప్రదించిన మీదట దీనిపై పల్నాడు జిల్లాఎస్పీ స్పందించి రేపు ఎట్టి పరిస్థితుల్లోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మంది ఎంపీటీసీ క్యాండిడేట్ల చేత నామినేషన్ వేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని, డి.ఎస్.పి మరియు ఎస్పీ హామీని నమ్మి మేము ధర్నా విరమించి వెళుతున్నామని రేపు వచ్చి తిరిగి నామినేషన్లు దాఖలు చేయనున్నామని తెలియజేశారు. మా రెడ్డిపాలెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మీద భౌతిక దాడి చేసి తల పగలగొట్టారని ,ఈ రకంగా హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యం లో మంచి పద్ధతి కాదని ,మీరు ప్రజలకు మంచి చేస్తే మీకు ఎన్నికలంటే ఎందుకు భయం అని ,ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లి ప్రజల చేత ఓట్లు వేయించుకొని గెలవాలని ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వారికి హితవు చెప్పారు. మాపై ఎన్ని దాడులు చేసినా భయపడకుండా ఈ నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్క కార్యకర్తకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ విస్తృత ప్రచారం

పల్నాడు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : వినుకొండ వ ట్ట ణం లో ము న్సి పా లి టీ పరిధిలోని స్వీపర్ కాలనీ వద్ద ప్రారంభమైన ఎన్నికల ప్రచారం 26 మరియు 27 వార్డులలో అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రచారం నిర్వహించారు. జీవీ 26, 27 వార్డులలో పోటీ చేస్తున్న కూటమి కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న షమీంఖాన్ విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులందరికీ భారీ మెజారిటీతో ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను



అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేయబోతున్న 'సూపర్ సిక్స్' పథకాల ప్రాముఖ్యతను చీఫ్ విప్ జీవీ ప్రజలకు వివరించారు. ప్రతిపక్ష పార్టీ (వైకాపా) చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన హితవు పలికారు. అభివృద్ధిని ఓర్వలేకనే కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్

గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి



అమరావతి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. గురువారం పీసీబీ కార్యాలయం నుంచి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్, వివిధ బేవరేజ్ సంస్థల ప్రతినిధులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలపై చర్చించారు. కుంభమేళా తరహాలో జరిగే గోదావరి పుష్కరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణయ్య సూచించారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టిక్ బాటిల్స్ ఎన్ని అమ్ముడయ్యాయి? ఎన్ని తిరిగి సేకరించారు? ఎంత పరిమాణంలో రీ సైక్లింగ్ జరిగిందనే వివరాలు నమోదు చేయాలని పీసీబీ అధికారులను ఆదేశించారు. వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో రీ సైక్లింగ్ చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని స్పష్టంచేశారు.

4,581 ఎంబిబియస్ ప్రవేశాల్లో 3,543 సీట్లు

రిజర్వుడ్ తరగతుల వారికి ప్రతిభ కలిగిన రిజర్వుడ్ విద్యార్థులకు 1,213 ఓపెన్ కేటగిరీ సీట్లు

విజయవాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): ప్రస్తుతం జరుగుతున్న ఎంబిబియస్ ప్రవేశాల్లో మూడు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తయ్యే నాటికి మొత్తం 4,581 కన్వీనర్ కోటా సీట్లలో 3,543 (77.34 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన విద్యార్థులకు కేటాయించినట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వెల్లడించింది. బుధవారంనాడు జారీ చేసిన ఒక పత్రికా ప్రకటనలో ఎంబిబియస్ ప్రవేశాలకు సంబంధించి అవలంబించిన విధానాలను, కేటాయింపు వివరాలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయి సుధీర్ వివరించారు. రిజర్వుడ్ కేటగిరీ విద్యార్థులకు ఎంబిబియస్ సీట్ల కేటాయింపులపై కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు. 2026-27 విద్యా సంవత్సరంలో నీట్-యూజీ పరీక్ష ఆధారంగా జరుగుతున్న ఎంబిబియస్ ప్రవేశాల్లో ప్రతిభ కనబరచిన రిజర్వుడు విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్ల కేటాయింపులో భారీ పెరుగుదల ఉన్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. మూడు కౌన్సిలింగ్ ల అనంతరం ప్రస్తుత ఎంబిబియస్ ప్రవేశాల్లో ఓపెన్ కేటగిరిలోని మొత్తం 2,026 సీట్లలో 1,213(59.87 శాతం) సీట్లు ప్రతిభ ఆధారంగా రిజర్వుడు వర్గాల వారికి కేటాయించడం జరిగింది. 2025-26లో ఈ సంఖ్య 981 (51.57 శాతం) గా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జారీ అయిన జీఓ 102 మేరకు రిజర్వుడు తరగతుల వారికి ఎంబిబియస్ ప్రవేశాల్లో అన్యాయం జరుగుతున్నట్లు కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, అది ఖండనీయమని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. మెరిటోరియస్ రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ప్రవేశాలు పొంది వదులుకున్న సీట్లను ఆయా రిజర్వుడు వర్గాలవారితోనే నియమాల మేరకు భర్తీ చేయాల్సి ఉంటుందని, ఆవిధంగానే చేయడం జరిగిందని రిజిస్ట్రార్ వివరించారు. దీనికి అదనంగా రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కింద ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఎంబిబియస్ ప్రవేశాల్లో రిజర్వుడు వర్గాల విద్యార్థులు సూచించిన వెబ్ ఆప్షన్ల మేరకే నిబంధనల ప్రకారం ప్రతిభ ఆధారిత సీట్ల కేటాయింపులు మెరిటోరియస్ రిజర్వుడు కేటగిరీ కింద జరుగుతాయని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ఇటీవల రాష్ట్ర హైకోర్టుకు కూడా తెలియజేశామని ఆయన తెలిపారు. ఈ అంశం ఉన్నత న్యాయస్థానం పరిశీలనలో ఉన్నా కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేయడం పట్ల రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్ తీవ్ర అభ్యంతరాన్ని వెలిబుచ్చారు.

పువ్వాడి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని

కనిగిరి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): కనిగిరి నియోజకవర్గం పామూరు మండల ఎంపీపీ కూటమి అభ్యర్థిగా పువ్వాడి వెంకటేశ్వర్లు చిలంకూరు ఎంపీటీసీ కి నామినేషన్ పత్రాలను బుధవారం ఆర్ ఓ జి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారవనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి లు పాల్గొని పువ్వాడి వెంకటేశ్వర్లు కు అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు ఏలూరు వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, అడుసుమల్లి ప్రభాకర్, దారవనేని



రాజేంద్రప్రసాద్, తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, మిరియం సుబ్బరాయుడు, మానం మల్లికార్జునరావు, పామూరు మాజీ ఉపసర్పంచ్ యాదాల సాయి కిరణ్, కనిగిరి బిజెపి మాజీ ఇంచార్జ్ కొండిశెట్టి వెంకటరమణయ్య, మండల టిడిపి ఉపాధ్యక్షులు అంచూరి వెంకట్ రెడ్డి, మొబీనా మౌలాలి, తదితర తెలుగుదేశం పార్టీ శ్రేణులు పువ్వాడి నామినేషన్ కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు.

పరిషత్ కోలాహలం..భీమవరంలో నామినేషన్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి



భీమవరం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): పరిషత్ ఎన్నికల నామినేషన్లు జోరందుకున్నాయి. నామినేషన్ కేంద్రాల వద్ద కార్యకర్తలు రద్దీతో కోలాహలంగా మారింది. ఎంపిటిసి అభ్యర్థులు తమ కేడర్‌తో కలసి వస్తున్నారు. మద్దతు దారులతో చేరుకుంటున్నారు. ఎంపిటిసి, జడ్పిటిసి నామినేషన్‌లకు ఒక్కరోజే గడువు మిగిలి ఉంది. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా జిల్లాలో ప్రశాంతంగా నామినేషన్లు వేస్తున్నారు. జడ్పీటీసీ అభ్యర్థులు భీమవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద నామినేషన్‌లు దాఖలు చేస్తున్నారు. ఎంపీటీసీ అభ్యర్థులు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు పార్టీ శ్రేణులు, మద్దతు దారులతో తరలిస్తున్నారు. రెండో రోజు నామినేషన్‌లు జోరందు కున్నాయి. మంచిరోజుగా భావించి అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు పోటీ పడ్డారు. ఎంపీపీ అభ్యర్థులు కూడా ఎంపీటీసీలుగా అత్యధిక మంది గురువారం దాఖలు చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం కేంద్రాల వద్ద మంచి జోష్ నెలకొంది. ఆచంట నియోజకవర్గ పరిధిలో కూటమి అభ్యర్థుల పెద్ద సందడే చేశారు. మంది మార్బలంతో కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వైసీపీ అభ్యర్థులు కూడా ఒకేరోజు నామినేషన్‌లు వేసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒక్కరోజు అయితే కేంద్రాల వద్ద తమ కార్యకర్తలతో సందడి ఉంటుందని నియోజకవర్గ నాయకత్వం ఆ దిశగా సూచనలు చేసింది. ఇతర పార్టీల నుంచి అంతగా పోటీ లేదు. సీపీఎం మాత్రమే అక్కడక్కడా తమ అభ్యర్థులను బరిలో నిలుపుతోంది. అటువంటి చోట్ల వైసీపీ నుంచి సీపీఎం అభ్యర్థులకు మద్దతు లభిస్తోంది. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలకు తొలిరోజు బుధవారం 10 నామినేషన్‌లు దాఖలయ్యాయి. రెండో రోజైన గురువారం ఏకంగా 66 నామినేషన్‌లు దాఖలు చేశారు. ప్రతి మండలం నుంచి జడ్పీటీసీలకు నామినేషన్‌లు దాఖలయ్యాయి. రెండు రోజుల్లో మొత్తం 76 నామినేషన్‌లు పడ్డాయి. ప్రధానంగా తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు అత్యధిక నామినేషన్‌లు వేశారు. కూటమి పొత్తులో భాగంగా కొన్ని మండలాల జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు దాఖలు చేశారు. జిల్లాలో 372 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రెండు రోజుల్లో 1042 నామినేషన్‌లు పడ్డాయి. తొలిరోజు 192, రెండో రోజు 850 నామినేషన్‌లు వేశారు. అందులో డమ్మీ అభ్యర్థులు కూడా ఉన్నారు. శుక్రవారంతో నామినేషన్‌ల గడువు ముగియనుంది. దాంతో అభ్యర్థులు ముందుగానే మేల్కొన్నారు. రెండో రోజు అత్యధికంగా నామినేషన్‌లు వేసేశారు. చివరి రోజు కూడా ఇదే తరహాలో రద్దీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు,

ప్రశాంతంగా నామినేషన్లు..పరిశీలించిన కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో నామినేషన్‌లు దాఖలు చేస్తున్నారని కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం భీమవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. రెండోరోజు నామినేషన్ల ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమణ, ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం భీమవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు తగిన సూచనలు చేశారు. భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, భీమవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ కిశోర్

ఏలూరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): ఏలూరు జిల్లాలో ప్రశాంతంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ప్రతి కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లపై గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నామినేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగంతో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అధికారులు, ఇన్‌చార్జి నియామకం, నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లావ్యాప్తంగా ప్రతి నామినేషన్ కేంద్రానికి ఒక ఎస్ఐ స్థాయి అధికారిని, అదేవిధంగా సమస్యాత్మక ప్రాంతాలలో సీఐ స్థాయి అధికారులను ప్రత్యేక ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి అభ్యర్థితోపాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుంది. నామినేషన్లు వేసే సమయంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనా,



బెదిరింపులకు గురిచేసే ప్రయత్నాలు జరిగితే.. పోలీస్ కంట్రోల్ రూమ్ అత్యవసర నంబరు 112, ప్రత్యేకంగా కేటాయించిన 95503 51100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అభ్యర్థులందరికీ పోలీస్‌శాఖ నుంచి పూర్తి భద్రత, సహాయం అందించబడు తుందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ను జిల్లా పౌరసరఫరాల అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సీఎస్ డీటీలతో పాటు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన రేషన్ డీలర్ల సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యక్షులతో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తాటి శివ రామప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సేవలను మరింత మెరుగువరచడం, రేషన్ దుకాణాల పనితీరును సమర్థవంతంగా నిర్వహించడం, ఈ-పాస్ యంత్రాల వినియోగం, రేషన్ కార్డుదారుల మొబైల్ నంబర్ల నమోదు వంటి అంశాలపై చర్చించారు. రేషన్ డీలర్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు, వారికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులు సూచించారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న బ్యాంకు రుణ దరఖాస్తులు, అవసరమైన చెల్లింపులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రేషన్ డీలర్ల మొబైల్ నంబర్లను సంబంధిత సాంకేతిక వ్యవస్థలో నమోదు చేసి, వారికి అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు. రైతు బజార్లలో ధాన్యం కొనుగోలు వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులు సూచించారు.



ప్రస్తుతం బియ్యం మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో రేషన్ కార్డుదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీపీఎల్ కార్డుదారులకు కిలో బియ్యాన్ని రూ.49 చొప్పున, కేఎన్ఎం రకం బియ్యాన్ని కిలో రూ.50 చొప్పున అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయాలు చేపట్టాలని సూచించారు. బియ్యం కొనుగోలు, నిల్వలు, పంపిణీ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని, రేషన్ డీలర్లకు అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర సేవలపై అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించేందుకు సమాచార వ్యవస్థను మెరుగుపరచాలని, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సేనాపతి సోమశేఖర్ గెలుపు ఖాయం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



విశాఖపట్నం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): గురువారం పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 115వ వార్డు నుండి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న సేనాపతి సోమశేఖర్ గెలుపు ఇప్పటికే ఖాయం అయిపోయిందని, మెజారిటీ కోసమే ప్రయత్నం చేయాలని ఆ పార్టీ విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆ వార్డులో సోమశేఖర్ కు మద్దతుగా ప్రచారం చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మాజీ వార్డు అధ్యక్షులు ముమ్మన వెంకటరమణ , ముమ్మన శ్రీరామ్మూర్తి మరియు కంపర అప్పారావు గారు వీరితోపాటు సుమారు 200 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారికి సాదర స్వాగతం పలికిన ఎమ్మెల్యే రమేష్ బాబు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకుడు, సమర్థుడు అయిన సోమశేఖర్ నాయకత్వంలో 115వ వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయన అందించిన సేవలకు గాను వార్డు ప్రజలందరూ సోమశేఖర్ కు ప్రత్యక్షంగా మద్దతు పలుకుతున్నారని వివరించారు. అలాగే పార్టీలో చేరిన నాయకులు అందరితోనూ సమన్వయం చేసుకొని వార్డును అభివృద్ధి చేయాలని సోమశేఖర్ ను ఎమ్మెల్యే రమేష్ బాబు ఆదేశించారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేసి పెట్టాలని సూచించారు.

జెడ్.పి.టి.సి. నామినేషన్ కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లు

విజయనగరం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి. ఎన్నికల నిర్వహణలో భాగంగా అభ్యర్థుల నామినేషన్ వేసే జిల్లా పరిషత్ ఆఫీసు వద్ద భద్రత ఏర్పాట్లను విజయనగరం డిఎస్పీ లి లక్ష్మణ మూర్తి లి గురువారం పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ ఆఫీసు వద్ద నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించి, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్టోబరు 23 వరకు నామినేషన్స్ స్వీకరణ జరగనున్నందున, జిల్లా పరిషత్ కేంద్రం వద్ద నామినేషను ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగే విధంగా భద్రత చర్యలు చేపడుతున్నామని డిఎస్పీ లక్ష్మణ మూర్తి తెలిపారు. డిఎస్పీ వెంట విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ రావు, వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నాలుగు ఎంపీటీసీ స్థానాల్లో సీపీఎం అభ్యర్థుల పోటీ



కూనవరం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): కూనవరం మండలంలోని నాలుగు ఎంపీటీసీ స్థానాల్లో సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు స్థానాలకు పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పెద్దార్కూరు ఎంపీటీసీ స్థానం నుంచి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, టేకులబోరు-2 నుంచి జిల్లా కమిటీ సభ్యురాలు మడకం నాగమణి, చూచిరేవుల నుంచి నస్కూరి కామేశ్వరి, రేగులపాడు నుంచి గుండం బుచ్చమ్మ నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పోలవరం నిర్వాసితుల సమస్యలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఎం అభ్యర్థులను ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఆవుల ఉపేంద్ర, మురళి, పాయం సత్యనారాయణ, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, శ్యామల కృష్ణ, తెల్లం తమ్మయ్య, బొగ్గా సుబ్బయ్య, బొగ్గా రామారావు, అమ్మాజీ, జయసుధ, బొగ్గా సుబ్బలక్ష్మి, బాబురావు, పొద్దయ్య, ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల రూట్ మార్చ్



విశాఖపట్నం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మరియు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ గారు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందితో కలిసి పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇప్పిలివానిపాలెం, నందవరపు పాలెం, చింతగట్ల, పెదగాడి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన వీధులు, రహదారుల గుండా పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తూ, రాబోయే పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఇతరులపై ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, గొడవలు సృష్టించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా ఎన్నికల నియమావళికి విరుద్ధమైన ఘటనలు చోటుచేసుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

పెందుర్తి పోలీసుల విజ్ఞప్తి

– ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించండి. – ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగకుండా మీ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి. – ఎన్నికల పేరుతో గొడవలు, ఘర్షణలు, తప్పుడు ప్రచారాలు మరియు శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దు. – సామాజిక మాధ్యమాల్లో ధృవీకరించని వార్తలు, వదంతులను ప్రచారం చేయవద్దు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేదా ఎన్నికలకు సంబంధించిన సమస్యలు గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పెందుర్తి పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు చేపడతారని ఇన్స్పెక్టర్ తెలిపారు. “మీ భద్రత కోసం... మీతోనే... మీ పెందుర్తి పోలీస్”

పెందుర్తి పోలీస్ స్టేష విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్

పులిచెర్ల రాజేశ్వరికి ఏ పదవి ఇస్తారు?

విశాఖపట్నం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): పులిచెర్ల రాజేశ్వరికి పార్టీలో ఉన్నత పదవి కల్పిస్తామన్న హామీతో టీడీపీ నాయకులు ఆమెను సంప్రదించినట్లు సమాచారం. గురువారం ఉదయం వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ స్వయంగా గాజువాకలోని రాజేశ్వరి నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఉన్నత పదవి ఇస్తారని ప్రణవ్ గోపాల్ హామీ ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. అయితే ఏ పదవి ఇవ్వనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ ఇటీవల పులిచెర్ల రాజేశ్వరి నివాసానికి స్వయంగా వెళ్లి ఆమెకు మద్దతు ప్రకటించారు. ఈ పరిణామం తర్వాత టీడీపీ నాయకులు రాజేశ్వరితో సంప్రదింపులు జరిపేందుకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రణవ్ గోపాల్ ఆమె నివాసానికి వెళ్లి భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజేశ్వరి రాజకీయ భవిష్యత్తు, ఆమెకు దక్కనున్న పదవి, పార్టీ నాయకత్వం నుంచి అందుతున్న హామీలపై స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆమెకు ఏ పదవి ఇవ్వాలని నిర్ణయించారో స్పష్టంగా చెప్పాలని నిలదీసినట్లు తెలిసింది. కేవలం హామీలకే పరిమితం కాకుండా, ఇవ్వనున్న పదవిపై స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. ఈ పరిణామంతో రాజేశ్వరికి పార్టీ నాయకత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగించనుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

డ్రోన్ నిఘా నీడలో ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లు



శ్రీకాకుళం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): శ్రీకాకుళం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను గురువారం రెండువ రోజు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద పరిస్థితులను, సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పోలీసు అధికారులు, సిబ్బందితో వైర్‌లెస్ ద్వారా సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కుసుంపురం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



క విటీ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): భవాని మాత నామస్మరణతో కుసుంపురం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మండలంలోని కుసుంపురం గ్రామంలో శ్రీ భవాని దీక్షపరుల ఆధ్వర్యంలో కలశజ్యోతి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ భవాని శరణు ఘోషతో సాగిన జ్యోతి తిరువీధులు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీ భవాని సన్నిధానం నుంచి సుమారు 250 మంది మహిళలు జ్యోతులు చేతబూని భక్తి పారవశ్యం తో తిరువీధుల్లో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగగా, మహిళల జ్యోతుల వెలుగులతో పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరిం చుకున్నాయి. అనంతరం భక్తులు ఊరేగింపుగా శ్రీ సింధూపురాణి ఆలయానికి చేరుకు న్నారు. ఈ ఉత్సవంలో గ్రామస్తులు, పెద్దలు, యువత, మహిళలు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుక గ్రామంలో సందడి నింపింది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలు పరిశీలించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పరిశీలించారు అనకాపల్లి జిల్లాలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండవ రోజుకు చేరిన నేపథ్యంలో, నామినేషన్ కేంద్రాలు మరియు వాటి పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా ఎస్పీ విస్తృతంగా పర్యటించారు. బుచ్చయ్యపేట మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్సై మనోజ్ కుమార్‌లతో కలిసి; రావికమతం ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట ఎస్సై శ్రీనివాస్‌తో; అలాగే రోలుగుంట ఎంపీడీవో కార్యా లయం వద్ద ఎస్సై రామ కృష్ణారావుతో కలిసి జిల్లా ఎస్పీ వర్యవేక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ పరిసర ప్రాంతా ల్లో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ?100 మీటర్ల వరిధిలో గుంపులను అనుమతిం చవద్దు: నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశిం చారు. 100 మీటర్ల లైన్ వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడకుండా తక్షణమే అక్కడ ఉన్న గుంపులను చెదరగొట్టాలని స్పష్టం చేశారు. వేర్వేరు పార్టీల వర్గాల మధ్య ఎలాంటి వాగ్వాదాలు, ఘర్షణలు తలెత్తకుండా 100 మీటర్ల పరిధి బయటే నియంత్రించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరిమిత సంఖ్యలోనే అనుమతి: నామినేషన్ కేంద్రం 100 మీటర్ల పరిధిలోకి అనవసరపు వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని, నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికి మించి ఎక్కువ మంది ఉండకూడదని స్పష్టం చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థులు, వారితో వచ్చిన వ్యక్తులు అక్కడే వేచి ఉండకుండా వెంటనే వెనుదిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీల సమయాల్లో సమన్వయం: వివిధ రాజకీయ పార్టీలు ఒకే సమయంలో కాకుండా వేర్వేరు సమయాల్లో ర్యాలీగా వచ్చ? నామినేషన్లు దాఖలు చేసేలా సమన్వయం చేసుకోవాలని, శాంతిభద్రతల సమస్యలు రాకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ నిర్దీత గడువులోగా ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. నిరంతర డ్రోన్ నిఘా ం కఠిన చర్యలు: భద్రతా పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ నిరంతరం నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అమలు: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. (144 సి.ఆర్.పి.సి) అమల్లో ఉన్నట్లు ఎస్పీ గారు పునరుద్ఘాటించారు. ప్రజలు, అభ్యర్థులు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ పర్యటనలో సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసు ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలపై అవగాహన



శ్రీకాకుళం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి, గారి ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎచ్చెర్ల పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎన్ వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల పరిసర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోలీసు శాఖ విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలు, నేర పరిశోధన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది కమ్యూనికేషన్ పరికరాలు, వివిధ రకాల ఆయుధాలు, బాంబు గుర్తింపు, నిర్వీర్య పరికరాలు, పోలీసు జాగిలాలు, డ్రోన్లు, వేలిముద్రల సేకరణ పరికరాలు, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ తదితరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ లో ఉపయోగించే బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ గన్‌లు, ట్రాఫిక్ సిగ్నలింగ్ పరికరాల పనితీరును వివరించారు. నేరస్థుల గుర్తింపు, నేర పరిశోధన లో ఆధారాల సేకరణ, పేలుడు పదార్థాల గుర్తింపు, ప్రజల భద్రతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ ఎన్. వెంకట రమణ మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు పోలీసు శాఖ విధులు, బాధ్యతలు, సాంకేతిక సామర్థ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు శ్రీనివాసరావు, ఖాదర్ భాష, ఆర్మ్డ్ బృందం, డ్రోన్, క్లూస్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల, చింతపల్లి,కొయ్యూరు,జీకే వీధి మండలాల్లో

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

పాడేరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల డైరెక్టర్ శ్రీ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి మండలాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డుల డైరెక్టర్ శ్రీ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను మండలాల వారీగా సమీక్షించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు స్వీకరించిన నామినేషన్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న రిటర్నింగ్ అధికారులు , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు , ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని



సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఆయా మండలాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, లైజనింగ్ అధికారి, జిల్లా పర్యాటక అధికారి పట్టాసి చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా ధర్మానా..? : అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం / అమరావతి, అక్టోబర్ 22 (మనం న్యూస్) : సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం మాదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో తానే అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా? అవి నీకు అర్థమయ్యాయా? అని ప్రశ్నించారు. తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని, ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు. 2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో మీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో



ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ పార్టీ, మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ఘోర పరాజయం తప్పదని ముందే తెలిసిపోయి, కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక, ఇప్పుడు పోలీసులు అడ్డుకుంటున్నారని, ఎన్ఓసీలు ఇవ్వడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మాది ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కాబట్టే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించగలుగుతోందన్నారు. ఎన్ఓసీల అవసరం లేదని స్పష్టం చేయడంతోపాటు, చిన్న ఫిర్యాదు అందినా పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చేంత స్పేచ్ఛగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీ గూండాగిరికి, ఫ్యాక్షన్ సంస్కృతికి రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రాన్ని అశాంతిపాలు చేయాలని చూసే గొడ్డలి పార్టీ ముఠా నాయకుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద గుంపులుగా చేరితే చర్యలు తప్పవు!

చింతూరు , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, చట్టబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కఠిన పోలీసు ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం చింతూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ కె. చక్రవర్తి నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి మద్దతుదారులు గుంపులుగా గుమిగూడడాన్ని నిషేధించినట్లు స్పష్టం చేశారు.

అభ్యర్థితో పాటు ఇద్దరికే అనుమతి

నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు నిబంధనల ప్రకారం మరో ఇద్దరిని మాత్రమే (1o2) అనుమతిస్తామని ఎస్పీ వెల్లడించారు. అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు సమయాలను ముందుగానే స్థానిక పోలీసు



అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.

పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించరాదు

జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు చట్టంలోని రూల్ 30 అమల్లో ఉన్నందున పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, సభలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగించినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఎస్‌డీపీవో ఉదయపావని, సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్, తహసీల్దార్ అర్జున్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలి

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



విశాఖ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం విశాఖ డాల్ఫిన్ హోటల్ లో జీవీఎంసీ కూటమి కార్పొరేట్ అభ్యర్థులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు, ప్రజలతో మమేకమవడం వంటి అంశాలపై అభ్యర్థులకు మంత్రి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. టిక్కెట్లు ఆశించి పొందలేని వారిని సమన్వయంతో కలుపుకొని పనిచేయాలన్నారు. వైసీపీ అభ్యర్థుల కంటే కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కూటమి రెండున్నరేళ్ల పాలనలోనే విశాఖ నగరానికి పెద్ద ఎత్తున కంపెనీలు, పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వైసీపీ హయాంలో విశాఖ నగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కూటమి పాలనలో నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలంతా కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి అభ్యర్థి కష్టపడి పని చేసి జీవీఎంసీపై కూటమి జెండా ఎగురవేయాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ శ్రీ భరత్ , ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్ , జీవీఎంసీ ఎన్నికల పరిశీలకులు ఎంఏ షరీఫ్, కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పాకలపాటి రవి రాజు ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



తుని , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : తుని మండలం కొలిమేరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి రెడ్డి రాజు నామినేషన్ కార్యక్రమం రాజకీయ సందడిని సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాకలపాటి రవి రాజు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని రెడ్డి రాజుకు తమ మద్దతు ప్రకటించారు. ఎంపీటీసీ అభ్యర్థిగా రెడ్డి రాజు నామినేషన్ దాఖలు చేసే సందర్భంగా గ్రామంలో ప్రత్యేక సందడి నెలకొంది. పార్టీ జెండాలతో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా తరలిరావడంతో కొలిమేరు గ్రామంలో రాజకీయ వాతావరణం ఉత్సాహభరితంగా మారింది. ర్యాలీతో గ్రామంలోని ప్రధాన వీధులు సందడిగా కనిపించాయి. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాకలపాటి రవి రాజు గారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. రెడ్డి రాజుకు మద్దతుగా పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైక్ ర్యాలీ, పార్టీ జెండాలు, నాయకులు, కార్యకర్తల రాకతో కొలిమేరు గ్రామంలో ఎన్నికల సందడి కనిపించింది. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు అభ్యర్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తమ హాజరుతో చాటిచెప్పారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమీకరణతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. రెడ్డి రాజు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కొలిమేరు గ్రామంలో సందడి నెలకొంది. పార్టీ జెండాలతో సాగిన బైక్ ర్యాలీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నామినేషన్ సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎంపీటీసీ అభ్యర్థి రెడ్డి రాజుకు మద్దతు తెలిపారు. పాకలపాటి రవి రాజు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ నామినేషన్ కార్యక్రమం కొలిమేరు గ్రామంలో రాజకీయ సందడిని నెలకొల్పింది. కొలిమేరు గ్రామంలో రెడ్డి రాజు నామినేషన్ కార్యక్రమం భారీగా నిర్వహించబడటంతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

కాకినాడ జిల్లా వ్యాప్తంగా పరిషత్ నామినేషన్లకు పటిష్టమైన పోలీసు బందోబస్తు



కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రత్యేక విభాగం ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించేలా చర్యలు చేపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ తొండంగి ప్రాంతంలో బందోబస్తు విధులను పర్యవేక్షించగా, పెద్దాపురం డీఎస్పీ శ్రీ ఏ.బి.జి. తిలక్ గారు తన సబ్‌డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ జిల్లా వ్యాప్తంగా పోలీసు బందోబస్తును నిరంతరం సమీక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు, అభ్యర్థులకు సూచనలు చేస్తూ, నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు భారీ ర్యాలీలతో రాకుండా, పరిమిత సంఖ్యలో అనుచరులతో మాత్రమే రావాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడవద్దని, పోలీసుల సూచనలు మరియు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి సహకరించి, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

అయోడిన్ లోప రుగ్మతల నివారణపై అవగాహన కార్యక్రమాలు



కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా, అక్టోబర్ 21 నుండి 28, 2026 వరకు నేషనల్ అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి రామారావుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం నీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా.కె. కె. అనిత అయోడిన్ పోస్టర్ విడుదల చేస్తూ అన్ని స్కూల్స్ మరియు హాస్టల్స్ ద ప్రజలకు అయోడిన్ లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ మార్గాలు మరియు అయోడిన్ కలిగిన ఉప్పును తగిన మోతాదులో వినియోగించడం యొక్క ప్రాముఖ్యతను వివరించనున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, పాఠశాల స్థాయిలో వ్యాసరచన, నినాదాల రచన, క్విజ్, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించడం, ఉప్పులో అయోడిన్ శాతాన్ని పరీక్షించే విధానంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టబడతాయి.ప్రజలందరూ అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగిస్తూ, అయోడిన్ లోప రుగ్మతల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకొని, బాధితులకు సహకరిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి జిల్లా అసంక్రమిత వ్యాధుల మరియు రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమము కార్యక్రమ అధికారి డా.వి అరుణ అధ్యక్షత వహించినారు. డీఐవో డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ఐ ప్రభాకర్, డిపిఎమ్ఓ జీ లక్ష్మి,డీఎల్ఎటివో డాక్టర్ చలమయ్య మరియు ఆఫీస్ సిబ్బంది కార్యాలయం, మరియూ ఇతర ఎన్.సి. డి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సేవ చేద్దాం



కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సేవ చేద్దామని సిపిఎం నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్ లో కామ్రేడ్ తోరాటి లక్ష్మణ మూర్తి 75 వ వర్ధంతి మరియు కామ్రేడ్ ఇనుగంటి రామతులశమ్మ 11 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. లక్ష్మణ మూర్తి చిత్ర పటానికి కె. సత్తిరాజు, రామతులశమ్మ చిత్ర పటానికి కె. వీరబాబు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సత్తిరాజు, వీరబాబు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామం నుండి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని 25 ఏళ్ళ వయసులో తోరాటి లక్ష్మణ మూర్తి అమరుడయ్యారని తెలిపారు.చిన్న వయసులోనే ఎర్రజెండా చేతబట్టి ఉద్యమ పథంలో నడిచారన్నారు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం మహిళా నేతగా రామతులశమ్మ కృషి చేసారని తెలిపారు. పాయకరావుపేట పంచాయతీలో 15 ఏళ్ళ పాటు పంచాయతీ మెంబర్ గా పని చేసారని, తూరంగి గ్రామంలో స్థిరపడ్డారని, మరణించే వరకు పార్టీ సభ్యురాలిగా కొనసాగించడమే కాకుండా పార్టీ యువతను ప్రోత్సాహించే వారని పేర్కొన్నారు. అమర వీరుల స్ఫూర్తితో నేటి తరం పార్టీ కార్యకర్తలు ప్రజా సేవ చేయాలని సిపిఎం పిలుపు ఇస్తోందన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు పార్టీ తక్షణ కర్తవ్యాలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, సిహెచ్. వేణు, మేడిశెట్టి వెంకటరమణ లతో పాటు సిహెచ్. సతీష్, కటారి పద్మనాభం, యు. సత్యనారాయణ, అనపర్తి ఏడుకొండలు, ఎం. నాగలక్ష్మి, టి. రాణి, పి. సత్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుల మృతి బాధాకరం

కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త) : తుని మండలం రావికంపాడు వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు భవానీ భక్తులు మృతి చెందడం పట్ల కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భవానీ భక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

ప్రజాభిముఖి పాలన, నిరాడంబరత,సామాజిక న్యాయానికి ఎస్.ఆర్. శంకరన్ జీవితం ఆదర్శం : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): ఎస్.ఆర్. శంకరన్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, ప్రజాభిముఖ పాలన,నిరాడంబరత, సామాజిక న్యాయం, బలహీన వర్గాల పట్ల అంకితభావం వంటి విలువలను స్మరించుకునే రోజుగా భావించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు . గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్.ఆర్. శంకరన్, ఐఏఎస్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, డిఆర్ఓ శంకరన్ విగ్రహానికి పూలమాలలు అలంకరించి, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. .పేదలు, దళితులు, గిరిజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన ఎస్.ఆర్. శంకరన్ ప్రజల ఐఏఎస్ అధికారిగా విశేష గుర్తింపు పొం దారని తెలిపారు.ఎస్.ఆర్. శంకరన్ 1934 అక్టోబర్ 22న తమిళనా డులోని తంజావూరు జిల్లాలో జన్మించారని, మద్రాస్ విశ్వవిద్యాల యంలో బీకాం పూర్తి చేసిన అనంతరం మదురైలో మూడేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచే శారని వివరించారు. 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌కు ఎంపికై, 1992 వరకు సుదీర్ఘకాలం సివిల్ సర్వీసుల్లో విశిష్ట సేవలం దించారన్నారు.. జిల్లా కలెక్టర్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీగా, వివిధ శాఖల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.

నిరాడంబర జీవితం.. ప్రజాసేవే లక్ష్యం.

ఉన్నత పదవుల్లో కొనసాగినప్పటికీ ఎస్.ఆర్. శంకరన్ అత్యంత నిరాడంబర మైన జీవితాన్ని గడిపారని జిల్లా కలెక్టర్ తెలిపారు.వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి, తన సమయం, శక్తి, వనరులను పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేశారని తెలిపారు. 2010 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన ప్పటికీ, ప్రజల పట్ల ఆయన చూపిన అంకితభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి, పరిపాలనలో పాటించిన నైతిక విలువలు నేటికీ సివిల్ సర్వీసు అధికారులకు శాశ్వత ప్రేరణగా నిలుస్తు న్నాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజల అవసరాలకు ప్రాధాన్య మిస్తూ, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేయడ మే ఎస్.ఆర్. శంకరన్‌కు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. తిప్పే నాయక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్

విశాఖపట్నం , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. రమేష్, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులతో కలిసి నార్త్ జోన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, జ్ఞాన నికేతన్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గాజువాక జోన్‌లోని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్, గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.

పంపిణీ కేంద్రాల్లో పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రిసెప్షన్ కేంద్రం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఆహార ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. స్టాట్యూటరీ, నాన్‌స్టాట్యూటరీ గదులు, స్ట్రాంగ్ రూములు, మూడు వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు), ఇతర పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సజావుగా చేరుకునేలా రవాణా, మార్గదర్శక ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలు ఓటర్లకు అర్థమయ్యేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

ఓటర్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

జ్ఞాన నికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ స్థలాభావం ఉన్నందున ఓటర్ల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మౌలిక



సదుపాయాలు కల్పించాలని సంబంధిత జోనల్ కమిషనర్ బి. రామును ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (సీ అండ్ డీ వేస్ట్) వెంటనే తొలగించాలని అదనపు కమిషనర్ కె. రమేష్‌కు సూచించారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

అనంతరం గాజువాక జోన్‌లోని బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ప్రాంగణం, గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, సంబంధిత సెక్టార్ అధికారులను ఏర్పాట్ల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసి ఉండాలని, కొన్ని చోట్ల పనులు ఇంకా ఆశించిన స్థాయిలో లేవని పేర్కొన్నారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు.

అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

పోలింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసు సబ్‌ఇన్స్పెక్టర్లతో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై, తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో, పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, రాయల్ బాబు, పద్మావతి, ఏసీపీ తిరుపతిరావు, సంబంధిత జోసల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజమండ్రి కారాగారంలో నవజాత శిశువుకు బారసాల



రాజమండ్రి , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): రాజమండ్రి ప్రత్యేక మహిళా కారాగారములో రిమాండ్ ముద్దాయిగా ఉన్న మహిళకు ప్రసవం కాగా గురువారం జైలు అధికారులు బారసాల నిర్వహించారు. తెనాలికి చెందిన బమ్మిడి దుర్గ ఏ పసలదుర్గ (ఆర్వీ నెం-1685)ఓ కేసులో రిమాండ్ విధించబడి గత ఆగస్టు 28న గుంటూరు జిల్లా కారాగారం నుండి రాజమండ్రి కేంద్ర కారాగారమునకు రిమాండ్ ముద్దాయిగా 9 వ నెల గర్భవతి హెచ్ఐవి పాజిటివ్ గా వచ్చినది. తదుపరి సెప్టెంబర్ 25న రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవం జరగగా 3.2 కేజీలబరువుతో ఆడపిల్ల జన్మించినది. తల్లి మరియు బిడ్డ క్షేమంగా ఉన్నారు. తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవి సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసికొన్నారు. అనంతరం జైలు అధికారులు మరియు సిబ్బంది ఆద్వర్యంలో ఖైదీల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా బారసాల(నేమింగ్ సేరిమోనీ) వేడుకను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించి దివ్యగ్రేసి అని నామకరణం చేయడం జరిగింది. పుట్టిన పాపకు బట్టలు, బేబీకిట్స్ మరియు తదితర వస్తువులు అందజేయడం జరిగింది. కారా గారంలో మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, సానుకూల వాతావరణాన్ని పెంపొందిం చడంలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మిషన్ శక్తి, అంగన్వాడీ మరియు పోషణ్ 2.0 పథకాల ద్వారా ప్రత్యేక మహిళా కారాగారము, రాజమహేంద్రవరం నందు ఉన్న ఖైదీల పిల్లలకు పౌష్టికాహారాన్ని ఐసీడీఎస్ శాఖ వారి ఆధ్వర్యంలో పాలు, గుడ్లు, అటుకులు, బియ్యం, ఖర్జూరాలు మరియు తదితర పౌష్టికాహార పదార్థాలను ఇవ్వడం జరుగుతుం ది. ఈ కార్యక్రమము నందు సూపరింటెండెంట్ సి. హెచ్. వసంతకుమారి, ఇందిరా భారతి రాయ్ మెడికల్ ఆఫీసర్ పి.పావని జైలర్,కె. సుభాషిణి డిప్యూటీ జైలర్,బి. నాగమణి డివ్యూటీ జైలర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థుని గెలిపించండి : తాటిపాక మధు

సామర్లకోట , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): స్థానిక ఎన్నికల్లో ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు ప్రజలకు పిలుపునిచ్చారు. సామర్లకోట లో స్థానిక 11 వార్డు విరాఘవపురం లో సీపీఐ ఎన్నికల ప్రచారంలో మధు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోం దన్నారు. ఇళ్ల స్థలాలు, ఉపాధి, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, కార్మికుల ఉద్యోగ భద్రత వంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక సంస్థల్లో సీపీఐ బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను సభల్లో ప్రస్తావించడం తో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పోరాడే సీపీఐ అభ్యర్థులకు ప్రజలు తమ విలువైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజల కోసం పోరాడే సీపీఐ అభ్యర్థులను గెలిపించలని పిలుపునిచ్చారు ఈ స్థానిక ఎన్నికల్లోఅధికారం కాపాడుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఇన్ని అరాచకాలు చేస్తోందని విమర్శించారు కోసంద్ర లో సీపీఐ అభ్యర్థులను బెదిరించండశీ కిడ్నప్ చేయడం ఎప్పడు చూడలేదని అన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, పట్టణ కార్యదర్శి పి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సాక రామకృష్ణ, ఏ భవాని, పప్పు ఆదినారాయణ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి మడకల రమణ, అర్జునరావు ఏ ఐ ఎస్ ఎఫ్ నాని తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి మాఫియాతో కాకినాడను సర్వనాశనం చేసిన ద్వారంపూడి : ఎమ్మెల్యే కొండబాబు నిప్పులు



కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అరాచకాలు, అక్రమ దందాలపై కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడే కాక, గద్దె దిగాక కూడా డ్రగ్స్, గంజాయి మాఫియాతో కాకినాడ యువత భవితవ్యాన్ని ద్వారంపూడి నాశనం చేశారని మండిపడ్డారు. కొచ్చిలో బయటపడిన భారీ డ్రగ్స్ రాకెట్ వెనుక అసలు సూత్రధారి ద్వారంపూడేనని, ఆయన అనుచరుల ప్రమేయం పక్కాగా ఉందని స్పష్టం చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో ఆధారాలతో సహా దొరికిపోయి, సమాధానం చెప్పలేక ప్రజలను పక్కదారి పట్టించే నీచ రాజకీయాలకు తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్వారంపూడి కుటుంబ చరిత్ర మొత్తం బ్లాక్ టికెట్లు, కల్తీ మద్యం, దొంగ నోట్లు, రేషన్ బియ్యం మాఫియాతోనే నిండిపోయిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం దొంగ దందాకు అడ్డుకట్ట పడటంతోనే ఇతర రాష్ట్రాలకు పారిపోయి చీకటి వ్యాపారాలు సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాకినాడ పోర్టు పనులపై ద్వారంపూడి చేస్తోన్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టారు. 2024లో 74 నౌకల ద్వారా 28 లక్షల టన్నుల సరుకు రవాణా జరిగితే, కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 107 నౌకల ద్వారా ఏకంగా 38 లక్షల టన్నుల రవాణా జరిగిందని లెక్కలతో సహా నిరూపించారు. పోర్టు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి, ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇచ్చే వ్యవస్థను తీసుకొచ్చామని స్పష్టం చేశారు. తమ కుటుంబానిది కష్టార్జితమని, ఎన్నికల ఖర్చుల కోసం ఆస్తులు అమ్ముకున్న చరిత్ర తమదని తెలిపారు. ద్వారంపూడిలా అక్రమ సంపాదన, దోపిడీ సొమ్ముతో తాము బతకడం లేదని, ఆస్తులపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.జగన్నాథపురం స్పోర్ట్స్ స్టేడియం, మూడో వంతెన, ఫ్లైఓవర్ల నిర్మాణాలను తాము ప్రారంభిస్తే.. గత ఐదేళ్ల ద్వారంపూడి పాలనలో వాటన్నింటినీ నాశనం చేసి పక్కన పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే స్మార్ట్ సిటీ నిధులు తీసుకొచ్చి పాఠశాలలు, మౌలిక వసతుల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ జాడ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉక్కుపాదం మోపుతున్నారని హెచ్చరించారు. ప్రత్యేక 'ఈగిల్' బృందాలు రంగంలోకి దిగాయని, ఎంతటి మాఫియా శక్తులైనా సరే చట్టం ముందు మోకరిల్లక తప్పదని గట్టి హెచ్చరిక జారీ చేశారు.

అర్హులైన ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలి : జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్

కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉ పాధ్యాయ నియోజక వర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి అర్హత కలిగిన ఉ పాధ్యాయు లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకొని విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి తిప్పే నాయక్ కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిం చిన సమావేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ పురోగతి,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు తదితర అంశాల పురోగతి పై సమీక్షిం చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్దంగా అర్హులందరూ ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకుని ఓటు హక్కును పొందాలనే ప్రధాన ఉద్దేశంతో సర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రవేశ పెట్టిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల ను పరిష్కరించ నున్నట్లు తెలిపారు.అక్టోబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితా ను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14,55,209 మంది ఓట ర్లు ఉన్నారని,వీరిలో 16,379 మంది దివ్యాంగ ఓటర్లు, 165 మంది విదేశాల్లో నివసించే భారతీయ ఓటర్లు (ఓవర్సీస్ ఓటర్లు)ఉన్నారని వివరించారు.సాధారణ ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం-6,



ఫారం-7,ఫారం-8 ల ద్వారా చేపట్టిన ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా ల ఉపాధ్యాయ శాసనమండలి నియోజక వర్గానికి సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులను ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్వో సూచించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఫారం-19 ద్వారా దరఖాస్తులుసమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించ నున్నందున,ఈ గడువు లోగా అర్హులైన ఉపాధ్యా యులందరూ దరఖాస్తు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందిం చాలని కోరారు ఉపాధ్యాయులకు ఓటరు నమో దుపై అవగాహన కల్పించి,అర్హులైవరూ నమోదు ప్రక్రియకు దూరంగా ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లాలో మొత్తం 16,737 మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 1,063 మంది నుంచి మాత్రమే ఓటరు నమోదుకు దరఖాస్తులు అందినట్లు డీఆర్వో తెలిపారు. మిగిలిన అర్హులైన ఉ పాధ్యా యులు కూడా నిర్దేశిత గడువులోగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసు కొని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా షెడ్యూల్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా రూపక ల్పనకు సంబంధించి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిం చనున్నట్లు డీఆర్వో తెలిపారు. ముసాయిదా జాబితాపై క్లెయిమ్‌లు,అభ్యంతరా లను డిసెంబర్ 10వ తేదీ వరకు స్వీకరించ నున్నట్లు వెల్లడించారు. తదుపరి ప్రక్రియ పూర్తిచేసి డిసెం బర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితానుప్రచురించనున్నట్లు వివరించారు. అర్హత కలిగిన ఉపాధ్యా యులందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో కోరారు. నిర్దేశిత గడువులను దృష్టి లో ఉంచుకొని ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఎస్పీ ప్రతినిధి ఎస్. అప్పా రావు, బీజేపీ ప్రతినిధి సీహెచ్. రమేష్ బాబు, సీపీఐ(ఎం) ప్రతినిధి పి. వీరబాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి పి. శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి జి. సాయిబాబా, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఆర్. వెంకటేశ్వ రరావు, జనసేన పార్టీ ప్రతినిధి అడబాల సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం, డిప్యూటీ తహసీల్దార్ తేజ తది తరులు పాల్గొన్నారు.

ఆర్గనైజ్డ్ క్రైమ్‌తో ఎన్నికలు ఆపేందుకు జగన్ అండ్ కో కుట్ర : టీడీపీ నేత వర్మ

కాకినాడ , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా, పంచాయతీలకు నిధులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కోర్టుల్లో ఏకంగా 59 కేసులు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలను అణచివేయడమే వైకాపా నైజమని, బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు మాత్రం బీసీల పక్షపాతిగా నిలిచి, స్థానిక సంస్థల్లో 34 శాతానికి పైగా స్థానాలు కేటాయించి వారిని రాజకీయంగా ప్రోత్సహించారని తెలిపారు. వైసీపీపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా అడుగంటిందని, దీంతో ఉనికి కోల్పోతామనే భయంతో దాడులకు దిగుతూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయపడుతున్నారని వర్మ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హింస చెలరేగినా అది పక్కా ప్లాన్ ప్రకారం ఎన్నికలు ఆపేందుకు వైసీపీ పన్నుతున్న వ్యూహంలో భాగమేనని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కేవలం రాయలసీమలోని 15 సమస్యాత్మక ప్రాంతాలు, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లోనే హింసాత్మక ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఒకవైపు ఆ పార్టీ నేత కోన రఘుపతి ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రశంసిస్తుంటే, మరోవైపు జగన్ అనుచరులు ఎన్నికల వ్యవస్థపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ చేసిన దుర్మార్గాలను ఎవరూ మరిచిపోలేదని, టీడీపీ అభ్యర్థులను భయపెట్టి వెయ్యికి పైగా నామినేషన్లను బలవంతంగా ఉ పసంహరింపజేశారని వర్మ ఆరోపించారు. పుంగనూరు, తంబళ్లపల్లె, చంద్రగిరి, పులివెందుల, మాచర్ల వంటి మున్సిపాలిటీల్లో ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకున్నారని, పిఠాపురంలో నడిరోడ్డుపై బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటే, ఏకంగా 500 మంది గూండాలను వెంటేసుకుని వచ్చి ప్రజలపై, పోలీసులపై దాడులు చేశారని మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడు స్వయంగా గూండాయిజం చేయడం, విధుల్లో ఉన్న పోలీసులపై మాజీ మంత్రి రోజా దురుసుగా ప్రవర్తించడం వారి ఫ్యాక్షన్ బుద్ధికి నిదర్శనమన్నారు. ఇలాంటి గూండా సంస్కృతిని ప్రజలు సహించబోరని, జగన్ రెడ్డి కుట్రలను తిప్పికొడతారని స్పష్టం చేశారు. అశాంతిని సృష్టించే వైసీపీ మూకలపై ఎన్నికల సంఘం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యం గెలవడం ఖాయమని వర్మ ధీమా వ్యక్తం చేశారు.

23 - 10 - 2026
అక్టోబర్
శుక్రవారం

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి: సీఎం

ఒకటి తరువాయి

స్థానిక ఎన్నికల్లో కొన్ని చోట్ల కూటమి పార్టీల నడుమ సీట్ల సర్దుబాటు, సీట్ల రిజర్వేషన్లపై స్వల్ప విభేదాలు తలెత్తాయి. వాటిపై తమకు సమాచారం ఇవ్వలేదని జనసేన నేతలు సీఎం వద్దే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే సీఎం, డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఎన్నికల అంశాలతోపాటు డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపైనా ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. వాస్తవానికి స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్ణయంపై కూటమి పార్టీల అగ్రనేతలు బుధవారం రాత్రే సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ఒప్పందాలే కాదు.. ఉత్పత్తి ప్రారంభం కావాలి

రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో ప్రభుత్వంతో సహా ప్రైవేటు భాగస్వామ్యంలోనూ భారీగా పెట్టుబడులు వచ్చేలా పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు పెట్టుబడులుగా మారి ఉత్పత్తి ప్రారంభించే అంశంపైనా దృష్టి పెట్టాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలు, ఇంధన శాఖ, పర్యాటక శాఖ, ఐటీ–ఎలక్ష?ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోద ముద్ర వేసింది. అయితే.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో.. ఏయే ప్రాంతాలకు ఎంతెంత పెట్టుబడితో పరిశ్రమల ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్న వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టుల కార్యాచరణ ప్రారంభమైనట్టు అధికారులు సీఎంకు తెలిపారు. కాగా.. వచ్చే నెలలో విశాఖలో నిర్వహించనున్న పారిశ్రామిక పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు కోసం అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌ను సిద్ధం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. సెమీకండక్టర్ రంగంలో తయారీ యూనిట్లతో కూడిన ఎకోసిస్టమ్ రాష్ట్రంలో ఏర్పాటు కావాలని సీఎం ఆకాంక్షించారు.

రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పోర్టులు అభివృద్ధి చేయాలి

లాజిస్టిక్స్ రంగంలోనూ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా పోర్టులు, ఎయిర్‌పోర్టులతోపాటు తూర్పు, పశ్చిమ దేశాలకు కనెక్టివిటీని పెంచడంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పోర్టు డెవలప్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని మౌలిక సదుపాయాల కల్పన శాఖను ఆదేశించారు. పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణలో ఓడరేవులు ప్రధాన పాత్రను పోషిస్తాయని అన్నారు. గ్లోబల్ స్థాయిలో పశ్చిమ, తూర్పు దేశాలను అనుసంధానం చేసేలా రాష్ట్రంలో ఓడరేవులను అభివృద్ధి చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని ఉత్పత్తులను విదేశాలకు నేరుగా ఎగుమతి చేసేలా ఓడరేవులు ఉండాలని, దానికి అనువుగా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని అన్నారు. దీనికి తగ్గ కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. ప్రధానంగా వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలైన పాలసీని రూపొందించాలన్నారు. ఇందుకోసం ఈ రంగాల్లో నిష్ణాతులైన కన్సల్టెట్లను నియమించుకోవాలని సూచించారు. నౌకాశ్రయాల్లో చర్యలు చేపట్టేందుకు మౌలిక సదుపాయాల కల్పన శాఖ సిద్ధమైంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు భారీ నౌకాశ్రయ నిర్మాణాలను చేపడుతున్న ఆ శాఖ.. ఇకపై నౌకా తయారీ, మరమ్మతు కేంద్రాలనూ ప్రోత్సహించాలని భావిస్తోంది. భారీ నౌకల మరమ్మతు పనులకు చాలా సమయం పడుతుంది. అప్పటిదాకా వాటిని ఓడరేవు బెర్త్‌ల్లోనే పార్కింగ్ చేసేందుకు భారీ మొత్తాలను చెల్లించాల్సి వస్తోంది. ఈ వ్యయాన్ని తగ్గించేందుకు రాష్ట్రంలోని నౌకాశ్రయాల్లోనే కొన్ని బెర్తులను రిపేరు కోసం కేటాయించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు నౌకాయాజమాన్యాలకు వ్యయం తగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టులను టెండరు ప్రక్రియ ద్వారా పూర్తిగా అప్పగించకుండా, లీజులకు ఇవ్వడంపైనా ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది.

వైసీపీ దాడి అత్యంత హేయం : నాదెండ్ల

ఒకటి తరువాయి

చూస్తోందని ఆయన ఆరోపించారు. తంబళ్లపల్లెలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లు దాఖలు చేయడానికి వెళుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలను వైసీపీ శ్రేణులు కవ్వించి దాడులకు తెగబడ్డాయని నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని జనసేన కార్యాలయాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, కొన్ని వాహనాలను కూడా నాశనం చేశారని, అడ్డు వచ్చిన వారిపై మారణాయుధాలతో దాడి చేశారని ఆయన ఆరోపించారు. "రాష్ట్రంలో అలజడులు, గొడవలు సృష్టించి స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలనే దురుద్దేశంతోనే వైసీపీ ఈ దుశ్చర్యలకు పాల్పడుతోంది. ఎన్నికల్లో గెలవలేమని స్పష్టంగా అర్థం కావడంతోనే హింస మార్గాన్ని ఎంచుకుంది" అని మనోహర్ విమర్శించారు. జనసేన ఇలాంటి గూండా చర్యలను చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తీవ్రంగా పరిగణించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. పోలీసు యంత్రాంగం కూడా వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిని, వారి వెనుక ఉన్న సూత్రధారులను అరెస్టు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యవాదులందరూ వైసీపీ చేస్తున్న ఈ అరాచక చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

వాట్సాప్, టెలిగ్రామ్ యూజర్లకు అలర్ట్

ఒకటి తరువాయి

అనుసం ధానమైన మొబైల్ నంబర్‌కు, వినియోగదారుడికి మధ్య మరింత పటిష్ఠమైన సంబంధాన్ని ఏర్పరచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. దీనివల్ల మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడటం కష్టతరమవుతుంది. రిజిస్టర్డ్ సిమ్ కార్డు ఫోన్‌లో లేకుండా, కేవలం వైఫై ద్వారా ఈ యాప్‌లను వినియోగించే వారికి భవిష్యత్తులో యాక్సెస్ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఐఫోన్, ఆండ్రాయిడ్ అనే తేడా లేకుండా అన్ని రకాల స్మార్ట్‌ఫోన్‌లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ముఖ్యంగా, ఒకటి కంటే ఎక్కువ పరికరాల్లో ఖాతాలను వాడేవారు, విదేశాలకు ప్రయాణించేవారు, వైఫైపై ఎక్కువగా ఆధారపడేవారు ఈ మార్పులను గమనించడం అవసరం. ఈ నిబంధనల అమలుకు 2026 డిసెంబర్ 31ని తుది గడువుగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాపిల్ సంస్థ ఇప్పటికే సిమ్ బైండింగ్‌కు అనుగుణంగా తమ ఐఓఎస్ సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేసినట్లు తెలుస్తోంది. లాగౌట్ నిబంధనపై స్పష్టతనిస్తూ, గతంలో వాట్సాప్ వెబ్ సెషన్ల నుంచి ప్రతీ ఆరు గంటలకు ఒకసారి ఆటోమేటిక్‌గా లాగౌట్ చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించింది. అయితే, తదుపరి నిర్ణయంతో దానిని వెనక్కి తీసుకుని, ప్రస్తుతం "రిస్క్–బేస్డ్ లాగౌట్" విధానాన్ని అనుసరించనుంది. అంటే, ఏదైనా అనుమానాస్పద లేదా మోసపూరిత చర్యలు గమనించినప్పుడు మాత్రమే తక్షణమే సేవలను నిలిపివేసే అధికారం ఉంటుంది. ప్రస్తుతానికి ఈ సిమ్ బైండింగ్ నిబంధనలు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లకు వర్తిస్తాయి. స్నాప్‌చాట్‌కు ఈ నిబంధనల నుంచి మినహాయింపు లభించినట్లు సమాచారం కాగా, సిగ్నల్ యాప్ ప్రభుత్వ నోటీసులపై ఇంకా స్పందించలేదు. జనవరి 1 నుంచే ఈ నిబంధనల ప్రభావం ప్రారంభమైనప్పటికీ, పూర్తిస్థాయిలో అమలు చేయడానికి కంపెనీలకు 2026 డిసెంబర్ 31 వరకు సమయం ఉంది. కాబట్టి, వినియోగదారులు తాము వాడుతున్న ఫోన్ మోడల్‌తో సంబంధం లేకుండా, రిజిస్టర్డ్ సిమ్ అందుబాటులో ఉందో లేదో సరిచూసుకోవడం ముఖ్యం.

ఆర్థిక సంక్షోభంలో అండగా నిలిచారు: భారత్‌కు శ్రీలంక మంత్రి ధన్యవాదాలు



శ్రీలంక , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): తమ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు శ్రీలంక ప్రభుత్వం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి చతురంగ అబేసింఘే ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో భారత్ తమకు వెన్నెముకగా నిలిచిందని ఆయన కొనియాడారు. 2022లో శ్రీలంకను చుట్టుముట్టిన తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని అబేసింఘే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంధనం, నిత్యావసరాల తీవ్ర కొరతతో పాటు ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటడం, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటడంతో దేశం అల్లకల్లోల స్థితిని ఎదుర్కొందని వివరించారు. "ఆ కష్టకాలంలో మాకు తోడుగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా ధన్యవాదాలు. మీరు అందించిన ఆర్థిక సహాయం సంక్షోభం నుంచి గట్టెక్కడానికి మాకు ఎంతగానో దోహదపడింది" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీలంక సంక్షోభం నుంచి పూర్తిగా కోలుకుందని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అబేసింఘే తెలిపారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కీలక సంస్కరణలు ప్రవేశపెట్టామని వివరించారు. భవిష్యత్తులో రుణ చెల్లింపుల విషయంలో ఎటువంటి రిస్క్ ఉండదని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఇకపై దేశాన్ని స్థిరత్వం నుంచి వృద్ధి పథం వైపు నడిపిస్తామని, ఇందులో మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. 1990లలో భారత్ క్రమంగా తన మార్కెట్లను తెరిచిన విధానం తమకు ఒక ఆదర్శమని అభిప్రాయపడ్డారు. పారా–టారిఫ్‌లను తొలగించడం, మరిన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి చర్యలతో వృద్ధిని సాధిస్తామని చెప్పారు. 2019 నుంచి నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నామని, రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో పారిశ్రామిక, ఆర్థిక మార్పుల కోసం ఇతర దేశాలతో భాగస్వామ్యానికి సిద్ధంగా ఉన్నామని అబేసింఘే స్పష్టం చేశారు.

ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం : వెంకయ్యనాయుడు

ఒకటి తరువాయి

లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ – వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత – అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

టిబెట్‌లో శక్తిమంతమైన భూకంపం

చైనా , అక్టోబర్ 22 (గ్లోబల్ వార్త): చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గురువారం రాత్రి స్థానిక కాలమానం ప్రకారం 10:33 గంటల సమయంలో ఉత్తర టిబెట్‌ను శక్తివంతమైన భూప్రకంపనలు వణికించాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.0గా నమోదైనట్లు చైనా భూకంప కేంద్రం వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8:03 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉత్తర టిబెట్‌లోని నాగ్చు నగర పరిధిలో గల బాచెన్ కౌంటీలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఇది సంభవించడంతో ప్రకంపనల ప్రభావం అధికంగా ఉన్నట్లు తెలుస్తోం ది. అయితే, అమెరికా జియోలాజికల్ సర్వే మాత్రం భూకంపం 18 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు పేర్కొంది. భూకంప కేంద్రం ఉన్న ప్రాంతం సముద్ర మట్టానికి సగటున 4,864 మీటర్ల ఎత్తులో ఉంది. చైనాలో 2024 జనవరి తర్వాత నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం ఇదేనని అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తక్షణమే తెలియరాలేదు. ఆ ప్రాంతంలో జనాభా చాలా తక్కువగా ఉండటంతో పూర్తి వివరాలు అందడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రధాన భూకంపం తర్వాత 5.0 నుంచి 5.2 తీవ్రతతో పలుమార్లు స్వల్ప ప్రకంపనలు కూడా నమోదయ్యాయి. ఇటీవల టిబెట్–నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన భారీ వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల నుంచి ఆ ప్రాంతం ఇంకా తేరుకోకముందే ఈ భూకంపం రావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టులో హిమానీనదం కూలిపోవడం వల్ల జరిగిన ఆ విపత్తులో 1,400 మందికి పైగా మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. భారత, యురేషియా టెక్టోనిక్ ప్లేట్లు ఒకదానికొకటి ఢీకొనడం వల్లే హిమాలయ ప్రాంతంలో భూకంపాలు తరచుగా సంభవిస్తాయని భూగర్భ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు సహాయక చర్యలపై దృష్టి సారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసిపోవాలి : మోదీ

ఒకటి తరువాయి

భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం అద్భుతమని కొనియాడారు. భారత్, పోలండ్ మధ్య ఆర్థిక సహకారం మరింత బలోపేతం అయ్యేలా ఆ ఒప్పందం సహకరిస్తుందన్నారు. అలాగే రక్షణ, అంతరిక్షం, న్యూక్లియర్ ఎనర్జీ రంగాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు భారత్, పోలండ్ ఒప్పందం చేసుకున్నాయని ప్రధాని తెలిపారు. ప్రపంచం నేడు సందిగ్ధంలో ఉందని, అలాంటి సమయంలో వృద్ధి, టెక్నాలజీ, ఇన్నొవేషన్?కు ప్రధాన కేంద్రాలుగా భారత్, పోలండ్ ఎదుగుతున్నాయని మోదీ అన్నారు. పోలండ్ జీడీపీ ట్రిలియన్ దాటిందని, ఇందుకు ఆ దేశ ప్రధాని టస్క్?ను అభినందిస్తున్నానని ఆయన చెప్పారు. భారత్ కూడా గత త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి రేటు నమోదు చేసిందన్నారు. పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ మాట్లాడుతూ.. భారత్, పోలండ్ మధ్య ద్వైపాక్షిక బంధంపై ప్రశంసలు కురిపించారు. ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగవడానికి రెండు దేశాలూ మరింతగా సహకరించుకుంటాయన్నారు. శాటిలైట్లు, డ్రోన్ల రంగాల్లో ఆ రెండు దేశాల మధ్య సహకారం.. ప్రపంచ దేశాలు రాజకీయ ఉద్రిక్తతలు, సంక్షోభాలను తగ్గించుకునేందుకు సాయం చేసిందన్నారు.

మోదీకి నెతన్యాహు ఫోన్

ఇజ్రాయెల్ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రత్యేక ఆహ్వానం పంపారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలన (ాఅస్రష్ట్ ఖ ంశీతీఎష్ట్ర) కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చార్‌తో కలిసి పాల్గొనాలని కోరినట్లు గురువారం నెతన్యాహు వెల్లడించారు. ఈ విషయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పంచుకుంటూ.. తాను ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు. తన ఆహ్వానానికి ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారన్నారు. భూమిపైనా, ఆకాశంలోనూ భారత్–ఇజ్రాయెల్ కలిసికట్టుగా ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించినట్లు నెతన్యాహు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇరుదేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బలమైన వ్యూహాత్మక సంబంధాలు, మైత్రిని మోదీ ప్రశంసించారని తెలిపారు

నవంబరు 1న ఎన్నికలు

ఒకటి తరువాయి

అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా గురువారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. కడప, తిరుపతి, రాజంపేట, మైదుకూరుల్లో తప్ప మరెక్కడా కొత్తగా నామినేషన్లు స్వీకరించాల్సిన అవసరం లేదని ఎస్ఈసీ అభిప్రాయపడింది. 19 మున్సిపాలిటీల్లో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదంటూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. ఆయా చోట్ల ఏవైనా ఫిర్యాదులు అంది ఉంటే వాటిని మరోసారి పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఎస్ఈసీని ఆదేశించడం.. అన్ని పట్టణ సంస్థల్లో అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను 25వ తేదీ వరకు ఆపాలని నిర్దేశించడం, దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అప్పటివరకు తుది జాబితా ప్రకటనను తాత్కాలికంగా ఆపేయడం తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పుపై ఎస్ఈసీ బుధ, గురువారాల్లో ఉన్నతాధికారులు, న్యాయనిపుణులతో సుదీర్ఘంగా కసరత్తు చేసింది. సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి మళ్లీ నివేదికలు తెప్పించుకుని పునఃపరిశీలించింది. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ కమిషనర్, ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు.. న్యాయవాదులతో విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం మైదుకూరు, కడప, రాజంపేట, తిరుపతి మినహా మరెక్కడా నామినేషన్ల ప్రక్రియకు భంగం వాటిల్లలేదని ఎస్ఈసీ నిర్ధారించింది. అక్కడక్కడా గొడవలు జరిగినా నామినేషన్ల ప్రక్రియపై వాటి ప్రభావం ఏ మాత్రం లేదని కలెక్టర్లు, ఎస్పీల నివేదికల ఆధారంగా తేల్చింది. దరిమిలా.. మైదుకూరులో మొత్తం 32 వార్డులకు.. కడప, రాజంపేట, తిరుపతిల్లో కొన్నేసి వార్డులకు మరోసారి నామినేషన్లు స్వీకరించాలని నిశ్చయించింది. నవంబరు 1వ తేదీన మొత్తం 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు పోలింగ్ జరుగుతుంది. రీపోలింగ్ అవసరమైతే మర్నాడు నిర్వహిస్తారు. 3న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ వివరాలను సుప్రీంకోర్టుకు 27వ తేదీన నివేదించనుంది.

విదేశాల్లో ఉంటూ విమర్శలా? : అమిత్ షా

ఒకటి తరువాయి

కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది. ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

ఎంత వరకైనా పోరాడదాం : జగన్

ఒకటి తరువాయి

పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

జగన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే

టీడీపీకి శ్రీకాకుళం జిల్లాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీకి సేవలందించిందని, కానీ చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినా అన్నీ కోల్పోయామని వాపోయారు. తన భర్త, దివంగత నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ పార్టీలో అవమానాలు ఎదుర్కొన్నారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు కనీసం పరామర్శించేందుకు కూడా టీడీపీ అధినేత రాలేదని ఆమె విమర్శించారు. తన భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే, స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారని, విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెలను కూడా ధ్వంసం చేశారని గుండ లక్ష్మీదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఎంతో బాధతో పార్టీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించినా పార్టీలోనే కొనసాగామని, అయినా తమను దూరం పెట్టారని అన్నారు. ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవిని ఆమె ఆశించగా, పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో పరిణామాలు వేగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైసీపీ నేతలు ఆమెను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. కూటమి పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని, వారికి మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానని లక్ష్మీదేవి తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో పనిచేశానని, వైసీపీలో కూడా జగన్ నాయకత్వంలో అదే నిబద్ధతతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA D.NO. 28-2-22, 11 FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA - 520002 . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902